ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 7 జనవరి 2025



మాచర్ల కోర్టు వద్ద తురకా కిశోర్, అతని సోదరుడు శ్రీకాంత్

నాడు దర్పం.. నేడు దుర్భరం

- పిన్నెల్లి ఇలాకాలో అరాచకాలతో వెలిగిన కిశోర్
- ఖద్దరు చొక్కాతో ఆనాటి ఖాకీల అండతో అకృత్యాల పరంపర
- నేడు చెప్పులు కూడా లేని దుస్థితిలో జైలులోకి

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ హయాంలో ఆనాటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుల అండదండలతో మాచర్లలో ప్రజాస్వామ్యానికి పాతరవేయటంలో ప్రధాన పాత్ర పోషించిన మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్ ఎట్టకేలకు కటకటాలపాలయ్యాడు. టీడీపీ నేతలపై దాడులు చేయటం, ఎన్నికల సమయంలో విధ్వంసకర చర్యలకు పాల్పడటం ద్వారా అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లికి వీరవిధేయుడుగా మారిన అరాచక వ్యక్తికి మున్సిపల్ చైర్మన్ పదవి కట్టబెట్టి ఖద్దరు చొక్కా వేసుకొని తిరిగే అవకాశం కల్పించారు. దీంతో కిశోర్ ఆగడాలకు గత ప్రభుత్వంలో అడ్డే లేకుండా పోయింది. మాచర్ల నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలను ఎండగట్టేందుకు ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ సీనియర్ నేత బుద్దా వెంకన్న వంటి వారు ఆ నియోజకవర్గంలో ధైర్యంగా అడుగుపెడితే అడ్డుకొని వారి వాహనాలపై కర్రలతో దాడులు చేసి హత్యాయత్నం చేసేందుకు కిశోర్ నాయకత్వంలో వైసీపీ మూక ప్రయత్నించింది. టీడీపీ నేతలు తృటిలో ప్రాణాప్రాయం నుంచి తప్పించుకున్నారు. కిశోర్ 'ఘనత' ను తెలుసుకొని ఆ నాటి ముఖ్యమంత్రి జగన్ కూడా పిన్నెల్లితో పాటు అతన్ని పిలిపించుకొని శభాష్ అని మెచ్చుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇక దాంతో కిశోర్ ఆగడాలకు అంతే లేకుండా పోయింది. ఏకంగా అనేక కేసులు తూతూ మంత్రంగా పెట్టిన ఆ నాటి పోలీసులు అతని దరిదాపులకు వెళ్ళే సాహసం కూడా జగన్ ప్రభుత్వంలో చేయలేకపోయారు. ముఖ్యం గా అప్పట్లో మాచర్ల టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న జూలకంటి బ్రహ్మారెడ్డి నియోజకవర్గంలో 2022 డిసెంబరు 16న టీడీపీ చేపట్టిన ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించే ప్రయత్నం చేయగా కిశోర్ నాయకత్వంలో దాడులు చేసి అడ్డుకోవటమే కాకుండా పార్టీ కార్యాలయాన్ని, బ్రహ్మారెడ్డి ఇంటిని ధ్వంసం చేశారు. అంతటి నేరానికి పాల్పడిన కిశోర్‌పై అప్పటి పోలీసులు నామమాత్రపు కేసులు నమోదు చేసి ఎటువంటి చర్యలు తీసుకోకుండా చేతులు దులుపేసుకున్నారు. ఇక తెలుగుదేశం అధికారంలోకి రావటంతో చంద్రబాబునాయుడు సీఎంగా పగ్గాలు చేపట్టిన వెంటనే అప్పటి నుంచి ఇప్పటి వరకు కిశోర్ పరారై అజ్ఞాతంలోకి వెళ్ళి అత్యంత దీనస్థితిలో గడిపాడు. ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు గుండు కొట్టించుకొని తళతళా మెరిసే ఖద్దరు చొక్కాలు స్థానే అతి సాదా సీదా గళ్ళ చొక్కాలు వేసుకొని హైదరాబాద్‌లో గడుపుతూ ఆఖరికి కాళ్ళకు చెప్పుల్లేని స్థితిలో పోలీసుల కళ్ళలో పడి చిక్కాడు. ఆ నాడు పిన్నెల్లి అండతో యథేచ్ఛగా చెలరేగి వైసీపీకి అధికారం శాశ్వత మనే భావనతో కన్నూమిన్నూ తెలియకుండా వ్యవహరించి సీన్ మారటంతో కుటుంబాన్ని సైతం వదిలేసి ఎక్కడో అనామకుడిగా ఆరు నెలలకు పైగా దుర్భరమైన జీవితం గడపాల్సి వచ్చింది.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

కేంద్ర నిధులు వృథా కానివ్వకండి

ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

నరసరావుపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అధికారులను ఆదేశించారు. విభజన తర్వాత నిధుల కొరత ఎదుర్కొంటున్న రాష్ట్రంలో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు కీలకం అని, వాటి ఫలాలు వీలైనంత ఎక్కువ మంది ప్రజలకు అందేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం కారణంగా ఖేలో ఇండియా లాంటి పథకాల నిధులు వెనక్కి వెళ్లిన పరిస్థితులు మళ్లీ రాకూడదన్నారు. నోడల్ అధికారులు ఒక నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేసినప్పుడే ఆశించిన స్థాయిలో నిధుల వినియోగం జరుగుతుందన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 37 కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు. ఏడాది పొడవునా తాగునీరు అందని చెంచు నివాసాలను గుర్తించి బోర్లు వేయించాలన్నారు. పాఠశాలల్లో ఇంటర్నెట్, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉపాధి హామీ పథకం ద్వారా 266 రకాల పనులు చేయగలిగే అవకాశం ఉండగా, మంజూరైన జాబ్ కార్డులలో ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 50 శాతం కంటే తక్కువగా ఉన్న పరిస్థితిని చక్కదిద్దా లన్నారు. స్వయం ఉపాధి, వ్యాపారాలు చేసుకునేందుకు ఆసక్తి కలిగిన వారికి సులభంగా రుణాలు పొందడంపై అవగాహన కల్పించేందుకు ప్రతి సచివాలయంలో ఎంపిక చేసిన సిబ్బం దికి శిక్షణ అందించాలన్నారు. రానున్న ఐదేళ్లలో పీఎంఈ జీపీ ద్వారా జిల్లాలోని 50,000 మంది యువతకు రుణాలు ఇప్పించాలన్నారు. జిల్లాలో రైల్వే గేట్ల వద్ద అవకాశం ఉన్న ఆర్వోబీలు, ఆర్‌యూబీలకు డీపీఆర్‌లు తయారు చేయాలన్నారు. ప్రధానమంత్రి జన్‌మన్ ద్వారా చెంచులకు మంజూరైన 600 వరకూ ఇళ్లను జూన్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మాచర్ల బైపాస్ భూముల సమస్యను ఆర్బిట్రేషన్ ద్వారా పరిష్కారించుకోవాలన్నారు.

నరసరావుపేట మార్కెట్ యార్డులో నిలిచిపోయిన కోల్డ్ స్టోరేజీని పునఃప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అరవిందబాబు కోరారు. మున్సిపల్ వేస్ట్ డిస్పోజల్ కోసం ములకలూరు గ్రామం వద్ద ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వ భూమికి ఆమోదం పెండింగ్ లో ఉందన్నారు. మాచర్ల పట్టణంలో రైల్వే గేట్ వద్ద రోడ్డు విస్తారణ చేస్తే ట్రాఫిక్ కష్టాలు తొలగుతాయి. దుర్గి మార్కెట్ యార్డు మిర్చి లావాదేవీలు జరగడం లేదు. గతంలో ఇసుక డంపింగ్ యార్డుగా మారింది. మంగళగిరి ఎయిమ్స్‌కు వినుకొండ, మాచర్ల నుంచి కల్పించిన ప్రత్యేక బస్సు ప్రయాణం గురించి, ఎయిమ్స్‌లో అందించే చికిత్సలపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కోరారు. వర్షాకాలంలో మాత్రమే పర్యాటకులు ఆసక్తి చూపే ప్రాంతంగా మిగిలిపోతున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టును రెగ్యులర్ టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు అవకాశాలను పరిశీలించాలని జూలకంటి కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెన్రీ క్రిస్టీనా, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పందెం కోళ్లు కత్తి కట్టి కాలు దువ్వడానికి సిద్ధం అవుతుంటే, రూ.కోట్లలో పందాలు వేసేందుకు వీలుగా బరులను సిద్ధం చేస్తున్నారు. మరో వారంలో పండుగ సందడి మొదలవుతున్న తరుణంలో కృష్ణానది తీర ప్రాంతాలు, సముద్ర తీర మండలాల్లో కొన్ని చోట్ల ఇప్పటికే కోడి పందాల కోసం బరులు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న బరుల కోసం ఇప్పటికే రబీ పంట వేసిన చేలను తీసుకుని పది నుంచి 30 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అన్ని ఏర్పాట్లతో బరికి సిద్ధమవుతున్నారు. మరోపక్క కేవలం పందెం కోసమే పెంచుతూ వస్తున్న కోడి పుంజులు రూ.లక్షలు పలుకుతున్నాయి. వీటి ధరే ఇంత ఉంటే వాటితో వేసే పందాలు ఎంతటి స్థాయిలో ఉంటాయనేది ఊహాకందని విషయమే. కేవలం కోడిపందాలే కాకుండా కోతముక్క, గుండాట వంటి మిగిలిన జూద క్రీడలకు ఈ బరులు ఏర్పాటు చేస్తున్న ఆవరణలోనే ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు మద్యం, బిర్యానీ కేంద్రాలకు కొదవే లేకుండా చూసేందుకు కూడా వెనుకాడటం లేదు.



చెరుకుపల్లి మండలం పుషాడపువారిపాలెం దగ్గర ఎక్సకవేటర్‌లు, ఇతరయంత్రాలతో కోడి పందాల కోసం బరి సిద్ధం చేస్తున్న చిత్రం



బరి తెగింపునకు సిద్ధం

- సంక్రాంతి వేళ కోడి పందాలకు సిద్ధమవుతున్న తీరం
- జూదం, మద్యం దుకాణాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- చివరిలో మ్యూజికల్ నైట్స్‌కూ సన్నాహాలు
- ఇప్పటి నుంచే లాడ్జీలూ బుకింగ్

తెనాలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా తీరంలో ప్రకాశం బ్యారేజీకి దిగువన గుంటూరు జిల్లా నుంచి సముద్ర తీరంలోని బాపట్ల జిల్లా వరకు కోడి పందాలకు కొదవ లేకుండా బరులు ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి రెండు నుంచి ఐదు కి.మీ దూరంలో ఒక బరి ఉండేలా ఏర్పాట్లు చేస్తే, ఇప్పుడు మాత్రం వాటిని తగ్గించి కేవలం జూదం కోసమే కాదన్నట్లు పరిమితంగానే ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని కృష్ణా తీరంలో ప్రస్తుతానికి 8 చోట్ల పెద్ద స్థాయి బరులు ఏర్పాటు చేసేందుకు నేతల నుండి అనుమతి దక్కినట్లు సమాచారం. అటు సముద్ర తీర మండలాల్లోని నిజాంపట్నం, నగరం, పీవీ పాలెం, కర్లపాలెం, బాపట్ల మరికొన్ని చోట్ల కోడి పందాలకు చిన్నస్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు బరులు ఏర్పాటు అవుతున్నాయి. దుగ్గిరాల మండలంలో ఒక చోట, కొల్లిపర మండలంలో రెండు చోట్ల, కొల్లూరు మండలంలో రెండు చోట్ల, భట్టిప్రోలు, రేపల్లె, చెరుకుపల్లి, నగరం మండలాల్లో ఒక్కొక్క చోట బరులు ఏర్పాటు చేసేందుకు నేతలు ఒకే అన్నారంటూ వాటిని స్థానిక నాయకులు యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేసేందుకు పెద్ద పెద్ద ఎక్సకవేటర్‌లను దించేశారు. బరులు వేసే ప్రాంగణం చుట్టూ సిమెంట్ దిమ్మెలు, ముళ్ల కంచె సాయంతో ఫెన్సింగ్ వేస్తూ లోపల మాత్రం ఐదు నుంచి 10 వరకు బరులు ఉండేలా ఒక్కో చోట సిద్ధం చేస్తున్నారు.

మద్యం, జూదానికి ఫుల్ డిమాండ్

కోడి పందాల కోసం ఏర్పాటు చేసే బరులను ఆయా ప్రాంతాల నేతల అనుచరులు, కింది స్థాయి నేతలు తమ ఆధీనంలో సిద్ధం చేస్తుంటే దానిలో కేవలం కోడి పందాలకే కాకుండా జూదం, మద్యం శిబిరాలకు మంచి డిమాండ్ పలుకుతోంది. సాధారణంగా ఒక బరిని ఏర్పాటు చేయాలంటే దానికి అంగీకారం తెలిపే నేతలకు, పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ వంటి సంబంధిత శాఖల అధికారులకు పందాలు నిర్వహించే వారం నుంచి పది రోజుల గడువునకు బరి స్థాయిని బట్టి రూ.20 నుంచి రూ.50 లక్షల వరకు మమూళ్లు ఇవ్వడం పరిపాటి. అంత మొత్తంలో రాబట్టుకునేందుకు నిర్వాహకులు కూడా రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పందాలు వేసుకునేందుకు వీలుగా ప్రత్యేక బరులను సిద్ధం చేస్తున్నారు. వీటితో పాటే మద్యం దుకాణాలు, బిర్యానీ సెంటర్లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఒక్కోదానిని రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వేలంలో వారికి అప్పగించేందుకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. కోడి పందాలు చూడాలన్నా, కోడిని బరిలో దింపాలన్నా ఫీజు చెల్లించాల్సిందే. పందెం కాసిన మొత్తంలోనూ పది శాతం నిర్వాహకులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఇవి కాక పార్కింగ్, కోతముక్క, గుండాట వంటి శిబిరాలకు లక్షల్లోనే డిమాండ్ ఉంటోంది. గతంలో బరులు ఎక్కువగా ఉండటంతో పందెం వేసే వారిని ఆకట్టుకునేందుకు బుల్లెట్ నుంచి కారు వరకు బహుమతులు అందించిన వారు ఉన్నారు. అయితే ఈ సారి బరులు పరిమితంగానే ఉండటంతో ఇటువంటి ఆకర్షణీయ బహుమతులు ఏ స్థాయిలో ఉంటాయో చూడాల్సిందే.



పందాల కోసం సిద్ధంగా ఉన్న కోళ్లు



చిన్న బరుల కోసం సిమెంట్ దిమ్మెలతో ప్రత్యేక ఏర్పాటు చేస్తున్న చిత్రం

కోడి పందాలకు స్థానికంగా ఉండే వారే కాకుండా తెలంగాణా నుంచి కూడా భారీ సంఖ్యలో ఏటా వస్తుండటంతో పట్టణాల్లో లాడ్జీలు కూడా ఇప్పటి నుంచే నిండిపోతున్నాయి. కొన్ని చోట్ల నిర్వాహకులే కొన్ని లాడ్జిలను రిజర్వ్ చేసుకుని పెట్టుకుంటుంటే పట్టణాలకు దూరంగా బరులు ఉన్నచోట మాత్రం ఖాళీగా ఉన్న ఇళ్లను అద్దెకు తీసుకుని తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు.సంక్రాంతి పండుగ చివరి రెండు రోజులు కోడి పందాలతో పాటు ముగింపు వేడుకల కిం ద మ్యూజికల్ నైట్స్ కూడా ఏర్పాటు చేసేందుకు శిబిరాలను ఇప్పటి నుంచే కేటాయిస్తున్నారు. వీటిలో సరదాగా జనానికి ఒక చోట అయితే వీఐపీలకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి వారికి అన్ని వసతులు కల్పించేందుకు కూడా హైటెక్ సొగసులతో తీర్చిదిద్దేందుకు గృ హోపకరణ సామాగ్రిని దింపేస్తున్నారు. పండు గ దగ్గర పడుతుండటంతో పందెం కోళ్ల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఒక్కో కోడి పుంజు రూ.20 వేల నుంచి రూ.లక్షకు పైగా పలుకుతోందని పెంపకందారులు చెబుతున్నారు. మొత్తం మీద సంక్రాంతి వేళ కోడి పందాల వేడుకలు మాత్రం జూద క్రీడలకు సిద్ధమవుతోంది.

8

వైభవంగా వేడుక

- భక్తి శ్రద్ధలతో ముగ్గురు రాజుల దేవాలయ శత వార్షికోత్సవం
- సమస్త దివ్య పూజాబలిలో పాల్గొన్న బిషప్‌లు
- వేలాదిగా తరలివచ్చిన క్రైస్తవ భక్తులు

పంతుళ్ళ పాలెం

- ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉపాధ్యాయులున్న గ్రామంగా ఏనుగుపాలెం గుర్తింపు



నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
పెదకూరపాడు	1,13,428	1,18,992	14	2,32,434
చిలకలూరిపేట	1,08,221	1,18,073	47	2,26,341
నరసరావుపేట	1,13,377	1,19,810	31	2,33,218
సత్తెనపల్లి	1,18,567	1,23,814	12	2,42,393
వినుకొండ	1,31,455	1,33,652	20	2,65,127
గురజాల	1,33,444	1,40,734	44	2,74,222
మాచర్ల	1,28,958	1,34,055	21	2,63,034
మొత్తం	8,46,762	8,88,597	189	17,36,769

జిల్లా ఓటర్లు 17,36,769

మహిళా ఓటర్లే అధికం

నరసరావుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)-2025లో భాగంగా చివరిదైన తుది ఓటర్ల జాబితాలు విడుదలయ్యాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అరుణ్‌బాబు సోమవారం సాయంత్రం జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ జాబితాలను విడుదల చేసి వాటి వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించారు.జిల్లాలో 17,36,769 మంది ఓటర్లగా నమోదై ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. గతం కంటే నామమాత్రంగా ఓటర్ల సంఖ్య పెరిగింది. 8,47,934 మంది పురుషులు, 8,88,646 మంది మహిళలు, 189 థర్డ్ జండర్‌లు ఓటర్లుగా ఉన్నారు. సర్వీస్ ఓట్లు 1,221 ఉన్నాయి. అత్యధికంగా గురజాల నియోజకవర్గంలో 2,74,422 ఓట్లు నమోదు కాగా తక్కువగా చిలకలూరిపేట నియోజకవర్గంలో 2,26,341 ఓట్లు ఉన్నాయి. పురుషుల కంటే మహిళల ఓట్లు 41,835 అధికంగా ఉన్నాయి.

రాజధాని భూసమీకరణలో భూములిచ్చిన అసైన్డ్ రైతుల కౌలు చెల్లింపులు ఇప్పటికీ కలగానే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాకతో తమ కష్టాలు తీరుతాయని మూడేళ్లుగా ఎదురు చూస్తున్న వారి ఆశలు ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా నెరవేరకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసైన్డ్ రైతులపై గత ప్రభుత్వం మోపిన సీఐడీ కేసుల అంశం ఎట్టకేలకూ కూటమి సర్కారు కొలిక్కి తెచ్చినా వారికి ఇంకా కౌలు అందకపోవడం విషాదం. మరో వారం రోజుల్లో సంక్రాంతి పండుగ రానున్న నేపథ్యంలో వారి ఆశలు మరింత పెరిగాయి. పండుగకైనా తమకు రావాల్సిన కౌలు బకాయిలు అందుతాయన్న ఆశతో వారంతా ఎదురు చూస్తున్నారు.

కలగానే.. అసైన్డ్ కౌలు

- కిందటి నెలలోనే కొలిక్కి వచ్చిన అమరావతి 'అసైన్డ్' వ్యవహారం
- రైతుల భూములకు ఎన్‌ఓసీలు ఇచ్చిన కలెక్టర్
- ఇప్పటికీ 1600 మంది రైతులకు అందని మూడేళ్ల కౌలు
- పండుగకైనా ఇవ్వాలని రైతుల వేడుకోళ్లు

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం 3,139 మంది అసైన్డ్ రైతులు 2,689. 14 ఎకరాల భూములు ఇచ్చారు. అసైన్డ్ రైతులు ఇచ్చిన భూములపై గత వైసీపీ సీఐడీ విచారణ తంతు నడిపించి, ఆ భూములను 'నాట్ ట్యాలీడ్' జాబితాలో పెట్టింది. మూడేళ్లుగా వారికి కౌలు అందకుండా చేసింది. దీంతో రాజధాని పరిధిలోని అసైన్డ్ రైతులు మూడేళ్లుగా నరకం అనుభవించారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దశలవారీగా రైతుల సమస్యలు పరిష్కరించింది. కిందటేడాది డిసెంబరు నాటికి అసైన్డ్ రైతుల భూములకు సంబంధించిన కేసుల్లో ఏపీ సీఐడీ, జిల్లా కలెక్టర్ నో అబ్జక్షన్ లెటర్లు కూడా ఇచ్చారు. దీంతో అసైన్డ్ రైతులంతా తమ కౌలు కష్టాలు తీరిపోయాయని సంతోషించారు. కానీ ఇప్పటికీ వారికి కౌలు దక్కలేదు.

1600 మందికి కౌలు పెండింగ్

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అసైన్డ్ రైతుల కౌలు బకాయిలు చెల్లించ డంపై దృష్టిపెట్టింది. ఏ సమస్య లేని రైతులకు వెంటనే కౌలు చెల్లించింది. తొలి విడతగా ఈ ఏడాది ఆగస్టులో 1,234 మంది అసైన్డ్ రైతులను నాట్ ట్యాలీడ్ జాబితా నుంచి విముక్తి కల్పించి వారికి రూ. 22 కోట్లు కౌలు బకాయిలు చె ల్లించింది. ఆ తరువాత రెండో విడతగా మరో 609 మందికి సీఐడీ కేసుల నుంచి విముక్తి కలిగించి కౌలు చెల్లింపుల కోసం రూ. 2.35 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఆమోదించి ఆర్థిక శాఖకు పంపించారు. మళ్లీ నవంబరులో మరో 1,093 మంది రైతులకు విముక్తి కల్పించారు. కాగా డిసెంబరు 20న మిగిలిన రైతులపై కేసులు కూడా తొలగించి కౌలు చెల్లింపులు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఇప్పటికీ 1300 ఎకరాలకు చెందిన 1,600 మంది రైతులకు మూడేళ్ల కౌలు బకాయిలు పెండింగులోనే ఉన్నాయి.

ప్లాట్ల రిజిస్ట్రేషన్ జరగడం లేదని ఆవేదన

రాజధాని కోసం భూ సమీకరణలో భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం రాకతో వాటి రిజిస్ట్రేషన్ ఐదేళ్లుగా ఆగిపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ రైతుల రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభ మయింది. వీటిపై సీఆర్డీఏ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు పలురకాల అభ్యంతరాలు పెడుతూ రిజిస్ట్రేషన్ చేయడం లేదని అసైన్డ్ రైతులు వాపోతున్నారు. అసైన్డ్ రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఆటంకమూ ఉండబోదని చెప్పిన తరువాత కూడా ప్లాట్లు రిజిస్ట్రేషన్లు కాకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం ఉన్నతస్థాయి అధికారులు దీనిపై దృష్టి సారించి రైతులకు కౌలు, ప్లాట్ల రిజిస్ట్రేష న్లు చేయించాలని వేడుకుంటున్నారు.



కౌలు కళ్లజూసి మూడేళ్లయింది

ఎం. విజయభాస్కర్

రాజధాని కోసం భూములు సంతోషంగా ఇచ్చాం. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో ఏటా కౌలు సక్రమంగా అందేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక సీఐడీ కేసులు పెట్టి విచారణ పేరుతో కౌలు ఆపేసింది. కౌలు కళ్ల జూసి ఇప్పటికి మూడేళ్లు అవుతోంది.

నిత్యం నరకం అనుభవిస్తున్నాం

జే విష్ణువర్ధనరావు

మూడేళ్లుగా కౌలు రాకపోవడంతో నరకం చూస్తున్నాం. రాజధాని కోసం భూములు త్యాగం చేసినందుకు మాకు ఇంత పెద్ద శిక్షా? అప్పులపాలైపోయాం. రూపాయి కోసం చేయి చాచాల్సి వస్తోంది. పిల్లల్ని చదువులు మాన్పించే పరిస్థితి వచ్చింది. తట్టుకుని ఓపిక పట్టాం. ఇప్పుడు కూడా ఇలా అయితే ఎలా? పండగకల్లా కౌలు చెల్లించాలి.

సచివాలయాలకు ఫైబర్ నెట్ సేవలు అందించాలి

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు, పక్కన బీఎస్ఎన్ఎల్ జీఎమ్ శ్రీధర్

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాలకు, ఆయా పాఠశాలలకు బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ సేవలు అందేలా ప్రణాళిక రూపొందించాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గుంటూరు, స్థానిక చంద్రమౌళి నగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సోమవారం టెలికం అడ్వైజరి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రైవేటు ఆపరేటర్ల కంటే మెరుగైన సేవలు అందించాలని సూచించారు. భారత్ నెట్ వినియోగదారులను పెంపొందించుకోవాలని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని 4జీ టవర్లను త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో కూడా సేవల్లో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. సంస్థ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలోని 40శాతం టవర్లను 4జీగా మార్చామని, మిగిలిన టవర్లను ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా ఎంపీ అయోధ్య రామిరెడ్డి పాల్గొనగా, నేరుగా ఆ సంస్థ డీజీఎమ్ శ్యామ్‌ప్రసాదు, ఐఎఫ్ఏ బాజీ, ఏజీఎమ్ గిరిబాబు, డీఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను భవిత కేంద్రాలకు పంపండి


మాట్లాడుతున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్యకుమారి

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లోపాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రాలకు పంపాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ ఎ.సూర్యకుమారి అన్నారు. సోమవారం గుంటూరు మహిళా ప్రాంగణంలో పోషణ్ భీ పఢాయి భీ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల విషయంలో తల్లిదండ్రులకు తగిన కౌన్సెలింగ్ నిర్వహించి వారిని భవిత కేంద్రాలకు తరలించాలని అన్నారు. పిల్లలకు పోషకాహార సేవలను అందించడానికి, వారి సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి, అంగన్‌వాడీ కార్యకర్తలందరి నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేయడం కోసం భారత ప్రభుత్వం పోషణ్ భీ పఢాయి భీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి విజయలక్ష్మి, ఈడీ పద్మజ, కోర్సు డైరెక్టర్ పుష్పలత, డాక్టర్ ప్రియాంక, ఉదయలక్ష్మి, నోడల్ ఆఫీసర్ శ్రీవాణి, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీవోలు పాల్గొన్నారు.

రేపు డైట్‌లో రంగోత్సవ్ పోటీలు

గుంటూరు(విద్య), జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్) బోయపాలెంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 8న రంగోత్సవ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతులు చదువుతున్న బాల బాలికలు అర్హులని తెలిపారు. మొత్తం 8 విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. క్విజ్, స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాల డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ (తెలుగు, ఆంగ్లం) రంగోలి (5 గురు సభ్యులు) జానపద నృత్యం, డిజిటల్ కాలేజి (యూనిటీ, సమైక్యత పోస్టర్) స్లోగన్ రైటింగ్ (ఏక్ భారత్ శ్రేష్ఠ భారత) రోల్ ప్లే (భారత సంస్కృతి, చరిత్రకు సంబంధించినవి) ఉంటాయి. గతేడాది పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన వారు పాల్గొనుటకు అనర్హులని తెలిపారు. ప్రతి కళా రూపానికి 5 నిముషాల సమయం ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలలో అధ్యాపకులు సి.పోలేరు, డాక్టర్ కె.ప్రసాద్ (9704790917, 8019207528)ను సంప్రదించాలని సూచించారు.

చినవడ్లపూడిలో యువకుడి బలవన్మరణం

మంగళగిరి సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినవడ్లపూడి గ్రామంలో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన పప్పు బాల జగదీశ్ (28) చినవడ్లపూడి గ్రామానికి చెందిన వలివేటి బాలకృష్ణ వద్ద గేదెల ఫారంలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన జగదీశ్ తరచూ ఇంటికి ఫోను చేసి తనకు చదువు అబ్బకపోవడంతో జీవితం నాశనమైందనీ, తనకు బతకాలని లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో గత నెల 29న గేదెల షెడ్డు వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు ఎయిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ జగదీశ్ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని సోదరుడు పూర్ణలీలా సాయికృష్ణ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్‌లో ఫ్లాట్లను కొనొద్దు

● వాటికి ఎటువంటి అనుమతుల్లేవు
● రైల్వే కూడా ఎన్‌వోసీ రద్దు చేసింది
● వాటిని దాచిపెట్టి విక్రయించాలని అంబటి మురళి చూస్తున్నాడు
● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాళ్ల నరేంద్ర, పక్కన పిల్లి బాబురావు

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు అంబటి మరళి గుంటూరు నగరంలోని స్వామి థియేటర్ సమీపంలో నిర్మిస్తున్న గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్లను కొనవద్దని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గుంటూరు విద్యానగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్ గ్రేస్ హైరైజ్డ్ అపార్టుమెంట్స్‌కు ఎటువంటి అనుమతులు లేకపోయినా వాటిని విక్రయించాలని అంబటి మురళి చూస్తున్నాడని, ఆయన ఉచ్చులో పడొద్దని సూచించారు. రైల్వే అనుమతి లేకపోయినా రాజకీయ పలుకుబడితో నగరపాలక సంస్థ అధికారులను ప్రలోభాలకు గురిచేసి ఈ నిర్మాణం చేపట్టాడని అన్నారు. అక్రమాలను ప్రశ్నిస్తే రాజకీయ వేధింపులంటూ అంబటి మురళి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మిస్తున్న ఆదిత్య ఇన్‌ఫ్రాకు రైల్వే ఎన్‌వోసీ రద్దు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రద్దు చేసిన లేఖను అప్పటి మంత్రి, మురళీ సోదరుడు అంబటి రాంబాబు అండతో నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు మాయం చేసిన విషయం నిజమా, కాదా అని ప్రశ్నించారు. ఆ తరువాత అనుమతి కోసం ఏలూరు జూట్‌మిల్ ప్రైవేట్ లిమిటడ్ (భజరంగ్ జూట్‌మిల్లు పూర్వ పేరు) దరఖాస్తు చేసుకున్నా రైల్వే అధికారులు తిరస్కరించారని అన్నారు. అనుమతి రద్దు, తిరస్కరణలు వైసీపీ అధికారంలోనే జరిగాయని, టీడీపీ హయాంలో కాదని గుర్తుచేశారు. దీంతో రాజకీయ కక్ష ఎక్కడ ఉందని ప్రశ్నించారు.

మోసానికి ప్రతి రూపం...

రైల్వే ట్రాక్ నుంచి 60 అడుగుల రోడ్డును వదిలివేసి నిర్మాణం చేస్తానని మాస్టర్ ప్లాన్‌లో చూపించి, ఈ నిబంధనలను తుంగలో తొక్కి ఆ రోడ్డులో కూడా నిర్మాణం చేపట్టడం వాస్తవం కాదా అని నిలదీశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా మరోసారి అనుమతి కోసం కార్పొరేషన్‌కు లేఖ పంపడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకపక్క వందల సంఖ్యలో ఫ్లాట్లను నిర్మిస్తూ డెవలప్‌మెంట్ పేరుతో ఏలూరు జూట్‌మిల్‌కు 87 ఫ్లాట్లను ఇచ్చే విధంగా జీపీఏ చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మరోవైపు అపార్ట్‌మెంట్లు కొన్నవారితో హైకోర్టులో కేసు వేయడం ఏ విధంగా చూడాలన్నారు. మోసానికి అంబటి మురళి ప్రతి రూపమని మండిపడ్డారు. అసలు జూట్‌మిల్ స్థలం మదర్ డాక్యుమెంట్లు మురళీ వద్ద లేవనీ, వాటిని దాచి పెట్టి వినియోగదారులకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నాడని ఆరోపించారు. గత టీడీపీ హయాంలోనే రిజిస్ట్రేషన్లు చేయవద్దని అప్పటి సబ్‌రిజిస్ట్రార్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. మదర్ డాక్యుమెంట్లు, సేల్ డీడ్‌లను బయట పెట్టాలని అడిగిన జూట్‌మిల్ కార్మిక సంఘ నాయకుడు పిల్లి బాబురావుపై అంబటి మురళి దాడి చేయించాడని ఆరోపించారు. గ్రీన్ గ్రేస్ భవనాలకు అడ్డగోలు అనుమతులకు సహకరించిన అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలని గుంటూరు ఎమ్మెల్యేలతో కలసి త్వరలోనే ప్రభుత్వాన్ని కోరనున్నట్లు చెప్పారు. సమావేశంలో జూట్‌మిల్లు కార్మిక సంఘం నేత పిల్లి బాబురావు, పొన్నూరు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా మార్చడమే లక్ష్యం

● ప్రతి పాఠశాలకు క్రీడా మైదానం
● శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు


క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న శాప్ చైర్మన్ రవి, ఎంపీ, విజ్ఞాన్ సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు (విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందనీ, ఇందులో భాగంగా ప్రతి పాఠశాలకు క్రీడా మైదానం ఉండాలని జీవో జారీ చేసిందని క్రీడాప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే 'విజ్ఞాన్ స్రవంతి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు 2025' ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిరోజు సోమవారం కబడ్డీ, క్రికెట్ వంటి క్రీడాంశాలతో పాటు నృత్యం, సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిందని తెలిపారు. స్పోర్ట్స్ పాలసీలో భాగంగా ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన వారికి రూ.7 కోట్లు నగదు ప్రోత్సాహకంతో పాటు గ్రూప్-1 ఉద్యోగాన్ని ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఆసియా క్రీడలు, ఖేలో ఇండియా తదితర క్రీడల్లో సత్తాచాటిన వారికి అందుకు అనుగుణంగా పారితోషికాలు అందిస్తుందని వెల్లడించారు. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ శాతాన్ని ప్రభుత్వం పెంచిందని వివరించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, ఇతర రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి వారి విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనూరాధ, నిరుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

అందరికీ సమాన విద్యావకాశాలు


హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, మైనార్టీ సలహాదారు ఎండీ షరీఫ్

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విద్యాపరంగా ఎదగాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అన్నివర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని మైనారిటీ బాలికల హాస్టల్‌ను సోమవారం ఆయన ఏపీ మైనారిటీ సలహాదారుడు, శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్‌తో కలిసి పరిశీలించారు. మైనారిటీ హాస్టల్‌లో సౌకర్యాలు, స్టడీ తరగతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్లో వసతులు బాగున్నాయా?, బోధన విధానం ఎలా ఉంది? అంటూ ఆరా తీశారు. హాస్టల్లో ఎలాంటి చిన్న సమస్య వచ్చినా వెంటనే తమను సంప్రదించాలని, తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. అనంతరం విలేకర్లతో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా విధానంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. హాస్టళ్లలో కేవలం విద్యా బోధన, స్టడీ తరగతులకే పరిమితం కాకుండా నేటి తరానికి అనుగుణంగా ఎనిమిదో తరగతి నుంచే టెక్నాలజీలో విద్యార్థులకు శిక్షణ ఇప్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్న మైనారిటీ హాస్టళ్లను సువిశాలమైన సొంత భవనాల్లోకి మారుస్తామని తెలిపారు. షరీఫ్ మాట్లాడుతూ మైనారిటీల విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. అన్ని పాఠశాలలో సమగ్ర విద్యా విధానాలు అవలంబించేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సూర్రై శ్రీనివాస్, జగన్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య, జమీర్, రఫీ, పుట్టగుంటి వెంకటేశ్వరరావు, కలాం, ఈర్ల లక్ష్మి, మస్తాన్, అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ సన్నద్ధం

● జిల్లా వ్యాప్తంగా 143 సర్వీసులు సిద్ధం
● 9 నుంచి 19 వరకు స్పెషల్ సర్వీసులు

గుంటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పర్వదినాలైన సంక్రాంతికి అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విభజిత గుంటూరు జిల్లాలోని గుంటూరు-1, 2 డిపోలతోపాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి 143 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎమ్ రవికాంత్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచే సర్వీసులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇందుకోసం టిక్కెట్ రిజర్వేషన్ చేసుకొనే సౌకర్యం కల్పించారు. సంక్రాంతి పండగకు విద్యా, ఉద్యోగం, ఇతర పనులపై హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దూర ప్రాంతాల్లో ఉన్న వారు తిరిగి గుంటూరు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ వరకు హైదరాబాద్ నుంచి గుంటూరు జిల్లాకు చేరుకునేలా సర్వీసులు సిద్ధం చేశారు. 9వ తేదీన హైదరాబాద్ నుంచి గుంటూరుకు 15 బస్సులు, తెనాలి 1, పొన్నూరుకి 2 సర్వీసులు అందుబాటులో ఉంచారు. అలానే 10న గుంటూరుకు 28, తెనాలికి 3, మంగళగిరికి 4, పొన్నూరుకు 5 బస్సులు ఉంచారు. రద్దీకి అనుగుణంగా 13 వరకు 143 సర్వీసులు ఏర్పాటు చేశారు. పండగ ముగిసిన తరువాత తిరుగు ప్రయాణికుల కోసం 15వ తేదీ రాత్రి నుంచే స్పెషల్ బస్సులను సిద్ధం చేస్తున్నారు. 19వ తేదీ వరకు పండగ రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు ఉంచుతామన్నారు.

స్పెషల్ బస్సుల్లోనూ సాధారణ చార్జీలే..



సంక్రాంతి పర్వదినానికి సంబంధించి జిల్లాలో ఎక్కడా ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రద్దీ ఉన్న డిపోల్లో అదనపు సర్వీసులు ఉంచుతున్నాం. అంతేగాక గతంలో మాదిరి స్పెషల్ బస్సులకు అదనపు చార్జీలు లేకుండా సాధారణ చార్జీలతోనే ప్రయాణించేలా ఆర్టీసీ సంస్థ నిర్ణయం తీసుకుంది. భద్రతతో కూడిన ఆర్టీసీ బస్సులను ప్రజలు ఆదరించాలి. ముందుగా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించాం.

\- డీపీటీవో రవికాంత్

ధాన్యం కొనుగోళ్లపై ఎమ్మెల్యే నరేంద్ర సీరియస్


జేసీతో సమావేశమైన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో పండిన ధాన్యం అంతా రైతుల వద్దే ఉంది. అక్కడి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మాత్రం నిల్వలతో నిండిపోయాయి. అధికారులు అత్యుత్సాహంతో పక్క నియోజకవర్గాల పంటను కొనుగోలు చేయటంతో స్థానిక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పొన్నూరులో సమావేశం నిర్వహించి అధికారుల తలంటినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాలేదు. దీంతో ఆయన మరింత సీరియస్ అయ్యారు. సోమవారం ఈ విషయంపై మాట్లాడేందుకు గుంటూరు కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. జాయింట్ కలెక్టర్‌తో భేటీ అయ్యారు. విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అధికారులు ఈ విషయంలో సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది.

గుంటూరు మీదుగా మరో నాలుగు సంక్రాంతి స్పెషల్స్

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా మరో నాలుగు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ .శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07615 కాచీగూడ - శ్రీకాకుళం రోడ్డు రైలు ఈ నెల 11, 15 తేదీల్లో సాయంత్రం 5.45కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07616 శ్రీకాకుళం రోడ్డు - కాచీగూడ రైలు ఈ నెల 12, 16 తేదీల్లో మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదుగా మరుసటి రోజు ఉదయం 7.35కి కాచీగూడ చేరుకొంటుంది. నంబరు. 07617 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు రైలు ఈ నెల 8న రాత్రి 7.20కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07618 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి రైలు ఈ నెల 9న మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 6.30కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

10 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

గుంటూరు(లీగల్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులో న్యాయవాదిని పోలీసులు చిత్రహింసలకు గురిచేయటాన్ని నిరసిస్తూ ఈ నెల 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టుల్లో తమ విధులను బహిష్కరించి నిరసన తెలపాలని నిర్ణయించారు. గుంటూరు జిల్లా బార్ అసోసియేషన్ల ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి అధ్యక్షతన గుంటూరులో సోమవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. క్రిస్మస్ సందర్భంగా గాయపడిన వారిని పరామర్శించేందుకు పొన్నూరుకు చెందిన దళిత న్యాయవాది బేతాళ ప్రకాశరావు ఆసుపత్రికి వెళ్లగా డాక్టర్ ఫిరోజ్ఖాన్ ప్రోద్బలంతో అతన్ని ఆస్పత్రి నుంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి సీఐ రవికిరణ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్ కుమార్, కానిస్టేబుళ్లు గోపి, మాధవ గోపి, స్టేషన్ కంప్యూటర్ ఆపరేటర్ మల్లికార్జునరావులు చిత్రహింసలు పెట్టారని న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. సంబంధిత డాక్టర్, పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గత వారం ఆందోళన ఫలితం గా ఎస్ఐపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. సీఐ రవి కిరణ్ , డాక్టర్ ఫిరోజ్ ఖాన్‌లపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఎస్ఐ మీద నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సెక్షన్లు మార్చాలని బార్ అసోసియేషన్‌ల ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ సంఘటనపై ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు, మానవ హక్కుల సంఘానికి, డాక్టర్‌పై చర్యలకు మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించింది. శుక్రవారం వరకు జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టు విధులకు గైరా జరు కావాలని తీర్మానించారు.

పింఛన్ల పంపిణీపై వ్యాఖ్యలు అర్థరహితం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి పింఛన్ల పంపిణీపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అర్థరహితమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారి ఏడు నెలలు గడుస్తున్నా కాకర్ల వెంకటరామిరెడ్డికి వైసీపీ వాసన పోలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించనప్పుడు ఏనాడు నోరు మెదపలేదన్నారు. పింఛన్ తీసుకునే ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదు అనేది కూటమి ప్రభుత్వ ఉద్దేశం అని, అందుకే ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారిగా కాకర్ల వెంకటరామిరెడ్డి ప్రవర్తించాలని, గతంలో పింఛన్ల పంపిణీకి కొన్ని వేల మంది సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం ఉపయోగించిందన్నారు. సచివాలయ ఉద్యోగులను ఏమాత్రం ఇబ్బంది పెట్టకుండా పింఛన్ ప్రతి ఇంటికి పంపిణీ చేస్తున్న ఘతన కూటమి ప్రభుత్వానిదన్నారు. కూటమి ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, వాసిరెడ్డి రవీంద్ర, కొలికొండ కొండలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ కింద పడి కూలీ మృతి

వినుకొండటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చాట్రగడ్డపాడు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా వేల్పూరు నుంచి నూజండ్ల మండలం కంభంపాడుకు ఫెన్సింగ్ రాళ్లను ట్రాక్టర్‌లో తీసుకువచ్చారు. వాటిని పొలంలో వేసి తిరిగి వేల్పూరు వెళ్తుండగా చాట్రగడ్డపాడు సమీపంలో ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ అదుపుతప్పింది. ఈ క్రమంలో ట్రాక్టర్‌లో ఉన్న కూలీ గాండ్ల నరసింహారెడ్డి (65) అక్కడికక్కడే మృతి చెందగా, ట్రాక్టర్ డ్రైవర్ చల్లా సాయితోపాటు ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న బైరెడ్డి రఘుబాబు, బండి కోటినాగులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణ సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాలను ప్రైవేటు వాహనంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్య కారణాలతో ఆత్మహత్య

రేపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాల వలన పట్టణంలోని ఇసుకపల్లికి చెందిన నంద్యాల రాజేంద్ర (40) సోమవారం ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. అతని భార్య శివనాగలక్ష్మి చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా, మృతి చెందినట్లు డాక్టర్‌లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఆడపిల్లలు ఉన్నారు.

సాగర్ సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 567.50 అడుగులు ఉంది. ఇది 250.30 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7937 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,293 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 50,430 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

67,835 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 75,348 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 67,835 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 51,894 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7200	13500	334	8000	14300
నెంబరు. 5	7500	10000	నెంబరు.5	8500	9500
273	10500	10500	273	10000	12000
341	7500	15000	341	7500	13500
4884	9500	9500	4884	--	--
సూపర్ 10	11200	11200	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	16200	తేజ	7500	15500
బ్యాడిగి	7500	14000	బ్యాడిగి	7500	11500
దేవనూరు డీలక్స్	8500	14500	దేవనూరు డీలక్స్	10000	10000
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	9000

ఆహార భద్రతలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● పల్నాడు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి షేక్ మస్తాన్‌వలి


చల్లగుండ్ల గ్రామ రికార్డులను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి మస్తాన్‌వలి

నకరికల్లు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : హోటళ్ళు, దాబాలు, రెస్టారెంట్లు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, కాఫీ, టీ దుకాణాలు, మటన్, చికెన్ వ్యాపార దుకాణాలు, ఆహార భద్రత నిబంధనలు పాటించకుంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మస్తాన్‌వలి హెచ్చరించారు. సోమవారం చల్లగుండ్ల సున్నంబట్టి సమీపాన గల దాబాకు సంబంధించి అనుమతి పత్రాలను, బిల్స్ బుక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకరంగా ఉండే ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని, నాసిరకమైన, హానికరమైన రంగులు, కుళ్లిన వ్యర్థాలను విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

తామర పురుగు నివారణపై అవగాహన

మాచవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మిర్చి పంటలో తామరపురుగు నివారణకు నీలి, పసుపు రంగు అట్టలను మిర్చి పంటలో ఏర్పాటు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి మోహన్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని గంగిరెడ్డిపాలెం, కొత్తపాలెం, మాచవరం గ్రామాల్లో మిర్చి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు నర్సయ్య, కరుణ కుమారి, యాకూబ్, రైతులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పిడుగురాళ్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకొని పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కోటేశ్వరరావు నాయక్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి పిడుగురాళ్ల మీదుగా గుంటూరు వరకు 10 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

అనుపు పర్యాటక అభివృద్ధికి తోడ్పాటునందించండి

సీఎం చంద్రబాబుకు ధారునాయక్ వినతి


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న ధారునాయక్

మాచర్ల రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపు పర్యాటక అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్ కోరారు. సోమవారం వెలగపూడిలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందించారు. బౌద్ధ పర్యాటక కేంద్రమైన అనుపునకు ప్రపంచ దేశాల నుంచి బుద్ధిస్టులతోపాటు పర్యాటకులు వస్తున్నారని, అనుపులో సౌకర్యాలను మెరుగుపరచాలని సీఎం చంద్రబాబుని ధారునాయక్ కోరారు.

నేడు టీడీపీ ముఖద్వారం ప్రారంభం

● హాజరుకానున్న ఇద్దరు ఎమ్మెల్యేలు

రెంటచింతల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రెంటచింతలో నూతనంగా నిర్మించిన ముఖద్వార ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం నూతనంగా నిర్మించిన ఆర్చి ప్రదేశంలో వున్న ముఖద్వారాన్ని వైసీపీ అధికారంలోకి రాగానే ధ్వంసం చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా, నూతన ధ్వంసం చేసిన ఆర్చి స్థానంలోనే నూతనంగా ఆర్చిని నిర్మించినట్లు తెలిపారు. ఈ ముఖద్వార ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు మాచర్ల, గురజాల ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. ముందుగా వారు గిరిజన సంక్షేమ గురుకులాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడతారన్నారు. అనంతరం రూ.55 లక్షలతో నిర్మించిన మూడు సీసీ రోడ్లను ప్రారంభిస్తారని చివరగా ఆర్చి ప్రారంభోత్సవంలో పాల్గొంటారని తెలిపారు.

విద్యుత్ రేట్లపై అభ్యంతరాలు తెలపండి

మాచర్లటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ నియంత్రణ మండలి 2025-26 సంవత్సరానికి రాష్ట్రంలో విద్యుత్ రేటు నిర్ణయంపై ఈనెల 7, 8, 10 తేదీల్లో భహిరంగ విచారణ ఉంటుందని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూతలపాటి సింగయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో వినియోగదారులు పాల్గొని తమ అభ్యంతరాలను తెలపవచ్చని సింగయ్య తెలిపారు.

22న సినిమా పాటల పోటీలు

మాచర్లటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మానుకొండ కళ్యాణ మండపంలో ఈనెల 22 న లయన్స్ క్లబ్ సాంస్కృతిక శాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కమలానస్ ఆధ్వర్యంలో 'మనమూ పాడుదాం' పేరిట తెలుగు రాష్ట్రాలస్థాయి సినిమా పాటల పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 12 లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. వివరాలకు సెల్: 94410 65681ను సంప్రదించాలన్నారు.

ఆలపాటిని అధిక మెజార్టీతో గెలిపించాలి

● ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపు
● పట్టణంలో గ్రాడ్యుయేట్ ఓటర్లతో ఆత్మీయ సమావేశం


గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థిగా బరిలో నిలిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కి ఓటు వేసి అత్యధిక మోజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గ్యాడ్యుయేట్ ఓటర్లను కోరారు. పట్టణంలోని వేంకటేశ్వర కళ్యాణ మండపంలో సోమవారం కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఓటర్లతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు, మేధావులు ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని, ఆవైపుగా కూటమి నేతలు కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ సభ్యత్వాన్ని మరింత పెంచేందుకు టీడీపీ శ్రేణులు దృష్టిసారించాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు మాట్లాడుతూ ప్రజలు నమ్మి ఐదేళ్ల అధికారం అప్పగిస్తే వ్యవస్థలన్నిటిని కలుషితం చేసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అపకీర్తి మూటగట్టుకున్నారన్నారు. వైసీపీ పాలనలో కలుషిత మద్యం ఎరులైపారిందన్నారు. విద్యా వ్యవస్థలను నాశనమైందన్నారు. ఉద్యోగ కల్పన లేక నిరుద్యోగులు వలస కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రాష్ట్రంలోని అన్ని రంగాలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ రామకృష్ణ, పార్టీ పరిశీలకులు వేములకొండ శ్రీనివాస్, టీడీపీ నేతలు యేల్లినేటి రామస్వామి, నాగోతు శౌరయ్య, భీమినేని వందనాదేవి, ఆళ్ల అమరేశ్వరావు, కళ్లం వీరభాస్కరరెడ్డి, పూజల వెంకట కోటయ్య, కట్టా శంకరావు, తవిటి బావనారాయణ, దరువూరి నాగేశ్వరావు, ఆతుకూరి నాగేశ్వరావు, బత్తుల నాగేశ్వరావు, పల్లపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేసిన ప్రతి ఒక్కరికీ శిక్ష తప్పదు

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన ప్రతి ఒక్కరికీ శిక్ష తప్పదని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బి బంగ్లాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోషించిన ఆకు రౌడీలకు శిక్ష పడేలా చర్యలు చేపడతామన్నారు. తురకా కిశోర్‌ను చట్టం వదిలిపెట్టదని, ఆయనతో పాటు తప్పుచేసిన ప్రతి ఒక్కరికీ శిక్ష తప్పదని అన్నారు. మండలంలోని ఒప్పిచర్లకు చెందిన చిరుమామిళ్ల శ్రీకాంత్ అమాయక ప్రజలకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని, ప్రజలెవ్వరూ మోసపోవద్దని హెచ్చరించారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి వెంట పంగులూరి పుల్లయ్య, షేక్ నన్నేసా, నీళ్ల అంజయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా చర్చి శతవార్షికోత్సవం

● పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు


ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ లావణ్య దంపతులను సత్కరిస్తున్న గురువులు


టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటిని ఆశీర్వదిస్తున్న విచారణ గురువులు

పెదకూరపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండలంలోని పాటిబండ్ల గ్రామంలో సోమవారం ముగ్గురు రాజుల దేవాలయ(చర్చి) శత వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌లు వేర్వేరుగా ఈ పూజల్లో పాల్గొన్నారు. వీరికి స్థానిక విచారణ గురువులు, వివిధ జిల్లాల పీఠాధిపతులు ఆశీర్వచనాలను అందించారు. తొలుత ముగ్గురు రాజుల దేవాలయంలోకి వెళ్ళి భక్తి శ్రద్ధలతో ఒత్తులను సమర్పించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఆయన సతీమణి లావణ్యలను విచారణ గురువులు దుశ్శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో ఈ పూజా కార్యక్రమాలకు తరలి వచ్చారు. బ్యాండ్ వాయిద్యాలతో, బాణ సంచా కాల్పులతో తేరు ఊరేగింపును గ్రామ పుర వీధుల్లో నిర్వహించారు.

పింఛన్ల పరిశీలన


గుత్తికొండలో పింఛన్‌దారులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు, కార్యదర్శులు

పిడుగురాళ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం 100 శాతం వున్నట్లు మెడికల్ సర్టిఫికెట్లు పొంది రూ.15వేలు పింఛన్ పొందుతున్న వారిని సోమవారం వైద్యాధికారుల బృందం పరిశీలించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో 100 శాతం అంగవైకల్యం వుండి మంచానికే పరిమితమైనట్లు మెడికల్ సర్టిఫికెట్లు పొందిన వారి ఇళ్లకే వెళ్లి వైద్య బృందం మెడికల్ సర్టిఫికెట్లను, అవి పొందిన వారిని పరిశీలించి తగు పరీక్షలు నిర్వహించారు. పిడుగురాళ్ల మండలంలో 15 వేల రూపాయలు పింఛన్ పొందుతున్న 37 మందిలో 25 మందిని వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

అచ్చంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపాలెం గ్రామంలో సోమవారం హిందూ శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాటిబండ్ల బాపిరాజు, నేతలు నెల్లూరి చిన వెంకటయ్య, బత్తుల శ్రీను, నెల్లూరి శ్రీను, నల్లమోతు హరిబాబు, ఎన్ వెంకటేశ్వర్లు, బుర్రి కిరణ్ పాల్గొన్నారు.

ల్యాప్ టాప్ అందజేత

అచ్చంపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన బొగ్గవరపు వెంకటసాయికి మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు సోమవారం ల్యాప్‌టాప్‌ను అందించారు. ఎన్ఆర్ఐ భాను ప్రకాష్‌తో పాటు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

క్రోసూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరు గ్రామంలో నాందీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్‌ను సోమవారం సర్పంచ్ ముక్కు అంజలి, టీడీపీ నేతలు దాచేపల్లి సైదా ప్రారంభించారు. నామ మాత్రపు ధరకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకే ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు. దొడ్లేరులో ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన నాందీ సంస్థ సీఈవో దివ్య, సంస్థ ఉద్యోగులు విలాసిని, దుర్గాప్రసాదు, శ్రీనివాస్‌లకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాచేపల్లి చందు, మొగల్ జాన్, బత్తుల హనుమంతరావు, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలి

క్రోసూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ టీశరత్ కుమార్, ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సాతులూరి రాఘవ డిమాండ్ చేశారు. సోమవారం వారు క్రోసూరులో విలేకరులతో మాట్లాడుతూ సంవత్సర కాలంగా పెండింగ్‌లోవున్న నెలవారి మ్యాచింగ్ గ్రాంట్ బకాయిలను కూడా తక్షణమే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగులతో చర్చించి పాత పింఛన్ పునరుద్ధరణ విషయంలో ఆమోద యోగ్య మైన పరిష్కారాన్ని చూపించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ క్రోసూరు మండల అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం


ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో పీజే విలియమ్స్

ముప్పాళ్ళ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ విధానంలో పడించిన ఆహార పదార్థాలను వినియోగించటం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీవో పీజే విలియమ్స్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం నార్నెపాడులో ప్రకృతి వ్యవసాయం ఆధారితంగా పండించిన కూరగాయల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఎంపీడీవో విలియమ్స్ సందర్శించి కూరగాయలను, ఆకు కూరలను కొనుగోలు చేశారు. ప్రదర్శనలో ఆకు కూరలు, కూరగాయలు, కారం, పసుపు పొడిలు ఉంచారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రూపవతి, ఏపీఎం బాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ కూరగాయల స్టాల్ ఏర్పాటు

వెల్దుర్తి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యాన సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తి రైతు భరోసా కేంద్రం వద్ద ఆర్గానిక్ కూరగాయల స్టాల్ ఏర్పాటు చేశారు. సంస్థ సిబ్బంది ఆర్గానిక్ ఉత్పత్తుల వలన కలిగే ప్రయోజనాలను స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ మాష్టర్ ట్రైనర్ అన్నపూర్ణ, క్లస్టర్ ఇన్‌చార్జిలు అబ్దుల్ నబీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తూట్ ఫైనాన్స్ వద్ద ఆందోళన

సత్తెనపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్ వద్ద పలువురు బాధితులు సోమవారం ఆందోళన చేశారు. ముత్తూరు ఫైనాన్స్‌లో తాము బంగారం తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నామని, డబ్బు చెల్లిస్తామన్నా తమ బంగారం తమకు ఇవ్వటం లేదని బాధితులు వాపోయారు.

న్యాయవాదుల నిరసన


కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సత్తెనపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పోలీసుల తీరును ఖండిస్తూ సోమవారం గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులను విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో న్యాయ దేవత విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. పొన్నూరు పోలీసులు పొన్నూరు న్యాయవాది బీ ప్రకాశరావు పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును న్యాయవాదులు ఖండించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కే అనీల్ కుమార్, చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి, బీఎల్ చిన్నయ్య, బీ శ్రీనివాస్ బాబు, దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయ కుమార్, కోటేశ్వరరావు, జానీ ఖాజావలి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాలపాటిని కలసిన గోగినేని

ముప్పాళ్ళ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌ను టీడీపీ మండల నాయకులు నాగార్జున సాగర్ కుడి కాలువ రెండవ విడత అధ్యక్షుడిగా నియమింప బడిన గోగినేని కోటేశ్వరరావు గుంటూరులోని కొమ్మాలపాటి నివాసంలో సోమవారం కలిశారు. కుడి కాలువ కమిటీ చైర్మన్‌గా నియమించేందుకు సహకరించినందుకు గాను కృతజ్ఞతలు తెలియ జేశారు.

ఆస్తి కోసం అక్కపై హత్యాయత్నం

● గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు

గుంటూరు, జనవరి 6, (ఆంధ్రజ్యోతి) గంజాయికి బానిసై, పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఆస్తి కోసం తన అక్కను హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ మేరకు సోమవారం బాధితురాలు ఉప్పుతల వేస్తేరు సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో తన మనవరాలుతో కలిసి ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. సత్తెనపల్లి మండలం మాదల గ్రామానికి చెందిన వేస్తేరుకు ముగ్గురు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెలు. చిన్న తమ్ముడు డేరంగుల దుర్గారావు బంగారం ట్రాప్ వేస్తూ మోసాలకు పాల్పడుతూ ఉంటాడు. ఈక్రమంలో అతనిపై జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల కేసులు ఉన్నాయి. వేస్తేరు మంగళగిరిలో నివాసం ఉంటుంది. దుర్గారావు ఆస్తి కోసం ఇప్పటికే తన ఇద్దరు సోదరులను, తన భర్తను చంపేశాడని, ఇప్పుడు తననూ చంపాలని చూస్తున్నాడని బాధితురాలు పేర్కొంది. అందుకే తాను మంగళగిరిని వదిలి తను మనవరాలు తీసుకొని తాను పాతగుంటూరులోని చర్చిలో తలదాచుకుంటున్నట్లు తెలిపారు. దుర్గారావు తనపై పలుమార్లు దాడికి పాల్పడినట్లు తెలిపింది. తనకు, తన మనవరాలికి దుర్గారావు నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని ఆమె ఎస్పీని వేడుకున్నారు.

బాధిత కుటుంబాలకు జంగా పరామర్శ

దాచేపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సోమవారం దాచేపల్లిలో ఇటీవల మృతి చెందిన సీనియర్ తాపీమేస్త్రి కోరె మోహన్‌రావు, మాజీము న్సుబు కోలా గోపాల్‌రెడ్డి కుటుంబాలను పరామర్శించారు. ఆయ న వెంట తంగెడ మేజర్ డీసీ చైర్మన్ పగడాల భాస్కరరావు, బొ మ్మిరెడ్డి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పసుపులేటి ఆదినా రాయణ, పల్లూరి రాఘవ, కమతం వెంకట్రావు, తదితరులున్నారు.

సాగునీటి కష్టాలకు చెక్

పిడుగురాళ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో రైతుల సాగునీటి కష్టాలను తీర్చేందుకే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముందస్తు ప్రణాళికతో కాల్వల మరమ్మతులు చేయడం జరిగిందనిసాగునీటి సంఘం డిసి-5, 6 అధ్యక్షులు గండికోట వెంకటేశ్వర్లు, పగడాల భాస్కరరావులు తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల పిడబ్ల్యు కార్యాలయంలో డిసి-5, డిసి-6 సాగునీటి సంఘాల చైర్మన్లు, ఆయా పరిధిలోని సాగునీటి సంఘ అధ్యక్షుల సమావేశం జరిగింది. సమావేశంలో ఏఈ పి ఆదినారాయణ, సాగునీటి సంఘం అధ్యక్షులు గోళ్ల ఆదినారాయణ, షరీఫ్, బొజ్జా సత్యనారాయణతో పాటు మరికొందరు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 38.84 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా 2 వేల క్యూసక్కులు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వినతిపత్రం అందజేత

దుర్గి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఎస్సీ కులగణనలో తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేయాలని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్ సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు.

గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.4.5 కోట్లు

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రెంటచింతలలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.4.5 కోట్లు విడుదలైనట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ పాలకం నిర్వాకం అవగాహన లేమితో అప్పట్లో మంజూరైన రూ.1.45 కోట్లు వెనక్కి మళ్లాయని గుర్తు చేశారు. నాబార్డు (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) ద్వారా ఈ నిధులు వచ్చాయన్నారు. 447/3 సర్వే నెంబర్లో 6.80 ఎకరాలుందని అందులో 5 ఎకరాలు పాఠశాలకు కేటాయిస్తామన్నారు. ఇప్పుడున్న పాఠశాల కేవలం 61 సెంట్లలో ఉండడం వలన విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని ఆప్రకటనలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


తెలుగునాడు టీచర్స్ క్యాలెండర్‌ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగునాడు టీచర్స్ యూనియన్ క్యాలెండర్‌ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం వెల్దుర్తిలోని ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగునాడు టీచర్స్ అసోసియేట్ అధ్యక్షులు మక్కపాటి రాంబాబు, యు పాపారావు, టి శ్రీనివాసరావు, అనిల్‌రెడ్డి,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమికి పరిహారం చెల్లిస్తాం


దేవాలయ భూములను పరిశీలిస్తున్న జాతీయ రహదారుల సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు

రెంటచింతల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 167 ఏడీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రెంటచింతలలోని వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన భూమిలో రహదారి నిర్మించారని ఇందుకుగానూ నష్టపరిహారం కావాలంటూ ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. సోమవారం జాతీయ రహదారులకు చెందిన సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డిలు 376/2 సర్వే నెంబర్‌లో 1.76 ఎకరాల భూమిలో నిర్మించిన రహదారిని పరిశీలించారు. ఈ క్రమంలో మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లిస్తామని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు హామినిచ్చినట్లు ఈవో రామిరెడ్డి తెలిపారు.

బాలుర మృతదేహాలకు ఎమ్మెల్యే కన్నా నివాళి

సత్తెనపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అమరావతి మేజరు కాలువలో ఈతకు దిగి మృతి చెందిన చరణ్, గోపీచంద్‌ల మృతదేహాలను సోమవారం ఏరియా వైద్యశాలలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని కన్నా హామి ఇచ్చారు.పోస్టుమార్టం నిర్వహించిన అనతరం చరణ్, గోపీచంద్‌ల మృతదేహాలను ఆస్పత్రి సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

● జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి, నల్లూరి గోపీచంద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థికసాయాన్ని చిట్టా విజయభాస్కర్‌రెడ్డి అందించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

సత్తెనపల్లి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిపూడిలో రూ.13 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరరావు, కోమటినేని శ్రీనివాసరావు, లగడపాటి గజానన, గద్దె అప్పారావు, కొనకంచి పుల్లారావు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

సత్తెనపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలో ఓటర్ల తుది జాబితాను సోమవారం మునిసిపల్ కమిషనర్ షమ్మి, మునిసిపల్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ సిబ్బంది విడుదల చేశారు. పట్టణంలోని పురుష ఓటర్లు 23,157, మహిళా ఓటర్లు 24,841 మంది, ట్రాన్స్ జెండర్లు ఐదుగురు, మొత్తం 48,003 మంది ఉన్నారని కమిషనర్ షమ్మి తెలియ జేశారు.

క్రైమ్ జోన్

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

రాజుపాలెం,జనవరి6(ఆంధ్రజ్యోతి): 20 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని ఇనిమెట్ల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ దరియావలి తన ఆటోలో రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్నట్లు స్థానిక ఎస్ఐ వేణుగోపాల్‌కు సమాచారం అందింది. వేంటనే ఆయన బృందంతో వెళ్లి ఆటోను పట్టుకుని, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● నకరికల్లు: నకరికల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 900 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, రెవెన్యూ అధికారులతో కలిసి సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యానికి గత నెలలో వేలం కూడా వేసినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి


రాజుపాలెం, జనవరి6 (ఆంధ్రజ్యోతి): నూతన భవన నిర్మాణ పని చేస్తూ ప్రమాదుశాత్తు వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లంశెట్టి శ్రీనివాసరావు(51) అదే గ్రామానికి చెందిన గాజుల దుర్గకి ఇంటి వద్ద భవన నిర్మాణ పని చేస్తుండగా మేస్త్రికి సిమెంటు పైకి ఇచ్చే సమయంలో ప్రమాదుశాత్తు కాలు జారీ కింద పడ్డాడు. ఈ సంఘటనలో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతుని భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ జీఎం నివాసంలో చోరీ - బంగారం, నగదు అపహరణ

దాచేపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలంలోని జేపీ సిమెంట్ ఫ్యాక్టరీలో జీఎం శంకరనారాయణరెడ్డి నివాసగృహంలో చోరీ జరిగిందని, బంగారం, నగదు దొంగతనంకు గురైనట్లు పోలీసులు తెలిపారు. శంకర నారాయణరెడ్డి కుటుంబసభ్యులు ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లగా, గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచివున్న 16 సవర్ల బంగారం, కొంత నగదు అపహరించినట్లు బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాచేపల్లి ఎస్ఐ పాపారావు సంఘటనా స్థలానికి చేరుకొని సాక్ష్యాధారాలు సేకరించారు.

పంతుళ్లపాలెం

ఉపాధ్యాయ వృత్తికి అంకితం !



- నాడు వివాదాలకు పెట్టింది పేరు
- నేడు ఉద్యోగాలకు నెలవు..
- ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉపాధ్యాయులున్న గ్రామంగా గుర్తింపు
- ఒకే కుటుంబంలో ఆరుగురూ టీచర్లే !
- డీఎస్సీ శిక్షణలో 50 మందికి పైగా విద్యార్థులు

ఒకప్పుడు ఘర్షణలకు మారుపేరుగా నిలిచిన ఆ పాలెం నేడు అత్యధిక ఉపాధ్యాయులు కలిగిన గ్రామంగా ఎంపికైంది. చదువుతోనే తమ తలరాతలు మారుతాయని భావించిన ఆ యువత ఉపాధ్యాయ వృత్తిని ప్రధానంగా ఎంచుకొని జీవితంలో రాణిస్తున్నారు. ఒకరుకాదు, ఇద్దరు కాదు గడిచిన కొంత కాలంగా ఆ గ్రామంలో 30కి మందికి పైగా ఉపాధ్యాయులుగా ఎంపికై ఆ గ్రామ ఖ్యాతిని రాష్ట్ర నలుదిశలా వ్యాప్తిచేసి ఉమ్మడి గుంటూరు జిల్లాకి ఓ ప్రత్యేకతను తీసుకొచ్చారు. ఘర్షణలను, వివాదాలను తొసిపుచ్చి, విద్యలో రాణిస్తూ, ఉద్యోగాల్లో స్థిర పడుతున్న యువత ఏనుగు పాలెంగా ఉన్న ఆ గ్రామం పేరును నేడు పంతుళ్ల పాలెంగా మార్చివేశారు.

వినుకొండటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాల్లోని వినుకొండ నియోజకవర్గం, వినుకొండ మండలంలోని ఏనుగుపాలెం గ్రామం అత్యధిక ఉపాధ్యాయులు కల్గిన గ్రామంగా గుర్తింపు సాధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఓ ప్రత్యేకతను చాటింది. 400 కుటుంబాలతో 1900 ఓట్లు కల్గిన గ్రామంలోని యువత ఉపాధ్యాయ ఉద్యోగాల సాధనలో ముందున్నారు. ఇప్పటికే 30కి మందికి పైగా ఉపాధ్యాయులుగానూ, ఫిజికల్ డైరెక్టర్లుగా ఉద్యోగాలు సాధించి ఏనుగుపాలెం గ్రామాన్ని పంతుళ్లపాలెంగా పిలిచేలా చేశారు.

డీఎస్సీ ఫలితాలు వచ్చాయంటే ఆ గ్రామం లోని యువత రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ర్యాంకులతో ఆ గ్రామం పేరు వినపడాల్సిందే. మొదటి తరానికి చెందిన కొణిజేటి సైదులు మాస్టారు ఆ గ్రామంలో మొట్ట మొదటి ఉపాధ్యాయుడు. ఆయనను ఆదర్శంగా తీసుకొని మేడిశెట్టి నాగేశ్వరరావు మాస్టారు రెండవ తరంలో పట్టణంలోని లయోలా పాఠశాల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గ్రామంలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ యువతకు ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ ఏర్పడేలా చేశారు. కుటుంబంలో ఆయన సతీమణి చిన్నమ్మతోపాటు పెద్ద కుమారుడు సుబ్బారావు ఆయన సతీమణి శ్రీలక్ష్మి, రెండవ కుమారుడు ప్రశాంత్, కుమార్తె ఇందిరా (2012 డీఎస్సీ జిల్లా ఫస్ట్ ర్యాంకు) ఇలా ఒకే ఇంట్లో ఆరుగురు ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు. అదే గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన గుడిపూడి అంజయ్య డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా స్థిరపడ్డారు. ఆ కుటుంబంలోని సోదరులైన అంకారావు, గోవిందు, వెంకటేశ్వర్లు ఆయన సతీమణి సంధ్య ఒకే కుటుంబంలో ఐదుగురు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఇలా గ్రామంలో 30 మందికి పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం గమనార్హం. మరో 40 నుండి 50 మంది విద్యార్థులు డీఎస్సీలో శిక్షణ పొందుతూ ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారు.



పీ. చినరామయ్య (2006 డీఎస్సీ స్టేట్ ఫస్ట్)



మేడిశెట్టి ఇందిరా (2012 డీఎస్సీ జిల్లా ఫస్ట్)



మేడిశెట్టి ప్రశాంత్ (2014 డీఎస్సీ జిల్లా ఫస్ట్)



గ్రామంలోని మొట్టమొదటి ఉపాధ్యాయుడు కొణిజేటి సైదులు మాస్టారు



ఆరుగురు వ్యాయామ ఉపాధ్యాయులు

గ్రామంలోని పాపసాని చిన్నరామయ్య (2006 డీఎస్సీలో స్టేట్ ఫస్ట్), గణప వీరాంజి (2012 డీఎస్సీలో జిల్లా ఫస్ట్), మేడిశెట్టి ప్రశాంత్ (2014 డీఎస్సీలో జిల్లా ఫస్ట్)లతోపాటు గుడిపూడి అంకారావు, గుంటూరు నరసరింహారావు, కాల్వ ఏసురాజులు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఉన్నారు. గణప వీరాంజి సతీమణి శివరాణి, తుంగ శ్రీనివాసరావు సతీమణి పుష్పలత, గుడిపూడి వెంకటేశ్వర్లు సతీమణి సంధ్యలు ఉపాధ్యాయులుగా ఉన్నారు.

ఏనుగుపాలెం గ్రామంలోని ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇప్పటి ఉపాధ్యాయులందరూ నాడు గ్రామంలోని సాధారణ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో విద్యనభ్యసించిన అనంతరం సుమారు మూడు కిలోమీటర్ల మేరకు నడుచుకుంటూ పెదకంచర్లలోని జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి వరకు చదువుకున్న వారే. గ్రామానికి చెందిన గుడిపూడి ప్రశాంత్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులందరూ గ్రామ అభివృద్ధికోసం తమవంతు సహాయసహకారాలను అందజేస్తున్నారు. ఉద్యోగులంతా కలిసి సుమారు రూ.కోటిన్నర ఖర్చుతో రామాలయం నిర్మించారు. జనవరి 26న ఆలయ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమ నిర్వహణకు సన్నహాలు చేస్తున్నారు.



ఉపాధ్యాయులైన మేడిశెట్టి నాగేశ్వరరావు మాస్టారు కుటుంబ సభ్యులు

అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధం

- దివ్యాంగుల పింఛన్లపై మొదలైన విచారణ
- 702 మంది ఇళ్లవద్దకు వెళ్లనున్న వైద్య బృందాలు
- ముందు రోజే నోటీసు.. ఆ తర్వాత పరీక్షలు



పిడుగురాళ్ల మండలం గుత్తికొండలో సోమవారం పింఛన్‌దారులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు, కార్యదర్శులు

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):నకిలీ దివ్యాంగుల పింఛన్‌లకు చెక్ పెట్టేందుకు రంగ సిద్ధం అయ్యింది. గత ప్రభుత్వం హయాంలో గ్రామ, వార్డు సచివాలయంలో రూ. 10 వేలు మామూళ్లు చెల్లించి నకిలీ వికలాంగుల సర్టిఫికెట్ పొందిన వారికి ఇబ్బంది రానుంది. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం ద్వారా రూ. 15 వేలు పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు వైద్య బృందాలు వెళ్లనున్నాయి. ఈ నెల 6వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జిల్లాలోని 702 మంది ఇళ్లకు ఈ బృందాలు వెళ్లనున్నాయి. వారంలో మూడు రోజుల పాటు వైద్య బృందాలు పింఛన్ దారుల ఇళ్లకు వెళ్లే విధంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా నిపుణులు అయిన వైద్యులతో నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు. వికలాంగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన డాక్టర్స్ కమిటీలో ఒక ఆర్థోపెడిక్, ఒక జనరల్ ఫిజీషియన్, సంబంధిత ఏరియా మెడికల్ ఆఫీసర్లు సభ్యులుగా ఉంటారు. వీరికి సహాయంగా ఒక డిజిటల్ అసిస్టెంట్ కూడా ఉంటారు. ఈ బృందం ప్రతి రోజు 25 మంది పింఛన్ దారులను వారి ఇళ్ల వద్దే పునః పరిశీలించి ధ్రువీకరిస్తారు. నిర్ణయించబడిన షెడ్యూల్ కన్నా ఒక రోజు ముందే లబ్ధిదారులకు నోటీసులు ఇస్తారు. వైద్య బృందాలను, మండల పరిషత్, మునిసిపల్ అధికారుల మధ్య సమన్వయం చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

మండలాల వారీగా..

జిల్లాలో రూ. 15 వేలు పొందుతున్న పింఛన్లు పొందున్న దివ్యాంగుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. చేబ్రోలు మండలంలో 34 మంది, దుగ్గిరాల మండలంలో 22 మంది, గుంటూరు టోటల్ 15, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 82 మంది, కాకుమాను మండలంలో 22, కొల్లిపొర మండలంలో 24, మంగళగిరిలో 42, మంగళగిరి మునిసిపాలిటీలో 5 మంది, మేడికొండూరు మండలంలో 30, పెదకాకాని మండలంలో 34, పెదనందిపాడు మండలంలో 40, ఫిరంగిపురం మండలం లో 59 మంది, పొన్నూరు మండలంలో 30, పొన్నూరు మునిసిపాలిటీలో 18 మంది, ప్రత్తిపాడు మండలంలో 28, తాడేపల్లి మండలంలో 15 మంది, తాడేపల్లి మునిసిపాలిటీ లో 12, తాడికొండ మండలంలో 32, తెనాలి మండలంలో 48 మంది, తెనాలి మునిసిపాలిటీ లో 29 మంది, తుళ్లూరు మండలంలో 47 మంది, వట్టి చెరుకూరు మండలంలో 34 మంది చొప్పున రూ. 15 వేలు పెన్షన్ పొందుతున్నారు.

అన్నీ బాగున్నా వికలాంగులే..

తాడికొండ మండలంలో ఒక వ్యక్తి రెండు కాళ్ళు లేవని పింఛన్ పొందుతున్నాడు. కానీ అతను రెండు కాళ్ళు బాగానే ఉన్నాయి. సైకిల్ కూడా బాగానే తొక్కుతాడు. అదే మండలంలో మరొకరికి కళ్ళు బాగానే కనపడినా చూపు లేదని సర్టిఫికెట్ ఇచ్చారు. ఇలా ప్రతి చోట అనర్హులకు రూ. 15 వేలు పింఛన్ ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి నకిలీ సర్టిఫికెట్‌లు సచివాలయం ద్వారానే మంజూరు అయ్యాయి.ర`హ. 10 వేలు ఇస్తే చాలా చోట్ల సచివాలయం సిబ్బంది ఇటువంటి సర్టిఫికెట్‌లు మంజూరు చేశారు. ప్రస్తుతం డాక్టర్ల బృందం ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పరీక్షించి నిజమైన దివ్యాంగులా? కాదా అన్న విషయాన్ని నిర్ధారిస్తున్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో

మరో 159 మంది ఎంపిక

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ పరేడ్ మైదానంలో మహిళా కానిస్టేబుల్ అభ్యర్థుకు నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో మరో 159 మంది తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. దేహదారుఢ్య పరీక్షలకు 331 మంది హాజరవగా, వారిలో 43 మంది సంబంధిత ధ్రువ పత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 288 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 14 బరువు, ఎత్తు కొలతలు సరిపోకపోవడం వల్ల తిరస్కరణకు గురయ్యారు. మిగిలిన 274 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 105 మంది విఫలమవ్వగా, 169 మంది తదుపరి పరీక్షకు అర్హత సాధించారు. 169 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 21 మంది అర్హత సాధించగా 148 మంది విఫలమయ్యారు. 169 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 159 మంది అర్హత సాధించారు. 10 మంది విఫలమయ్యారు. మొత్తం 288 మంది మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 159 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. మహిళా కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ఎస్పీ స్వయంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ అధికారులకు, అభ్యర్థులకు ఎస్పీ పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు సుప్రజ, హనుమంతు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



పరుగు పోటీల్లో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

వైభవంగా

వేడుక

- భక్తి శ్రద్ధలతో ముగ్గురు రాజుల దేవాలయ శత వార్షికోత్సవం
- సమష్టి దివ్య పూజాబలిలో
- పాల్గొన్న బిషప్‌లు
- వేలాదిగా తరలివచ్చిన క్రైస్తవ భక్తులు



పెదకూరపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటిబండ్ల గ్రామంలో సోమవారం ముగ్గురు రాజుల దేవాలయ శత వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య ప్రధానార్చకులుగా వ్యవహరించగా ముఖ్య ప్రసంగీకులుగా శ్రీకాకుళం పీఠాధిపతులు రెవరెండ్ డాక్టర్ రాయరాల విజయ కుమార్ ప్రసంగించి ముగ్గురు రాజుల దేవాలయ విశిష్టతను వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పీఠాధిపతులు రెవరెండ్ డాక్టర్ గాలి బాలి కడప, విజయవాడ పీఠాధిపతులు డాక్టర్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, కర్నూలు పీఠాధిపతులు డాక్టర్ గోరంట్ల జ్వానేష్, వరంగల్ పీఠాధిపతులు డాక్టర్ ఉడుముల బాల, నెల్లూరు బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం, ఖమ్మం పీఠాధిపతులు డాక్టర్ ప్రకాష్ సాగిలి, నెల్లూరు పీఠాధిపతులు డాక్టర్ పిల్లి ఆంతోని దాసు, నల్గొండ పీఠాధిపతులు డాక్టర్ కే దమన కుమార్, డాక్టర్ గోవిందు జోజి, స్థానిక విచారణ గురువులు చిన్నాబత్తిని హృదయ రాజు, సహాయ గురువు నందిగామ సురేష్‌లు ప్రత్యేక ప్రసంగాలు, పూజలను నిర్వహించారు. పాటిబండ్ల గ్రామానికి చెందిన దేశ, విదేశాల్లో స్థిర పడిన వారు ఈ శత వార్షికోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన విచారణ గురువులు, మత కన్యలు, వేలాది మంది క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



ఆలయ శతవార్షికోత్సవానికి హాజరైన పీఠాధిపతులు



ముగ్గురు రాజుల దేవాలయ శతవార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న శ్రీకాకుళం పీఠాధిపతులు డాక్టర్ రాయర్ల విజయ కుమార్



కళాయిలో బెల్లం ఊటను కలియబెడుతున్న రైతు

సంక్రాంతి వస్తుందంటే గుర్తుకొచ్చేరి అరిసెలు, అరిసెల తయారీకి ముఖ్యంగా కావలసింది బెల్లం. బెల్లం సరయినది అయితేనే అరిసెల పాకం బాగా వచ్చి, మంచి రుచిగా వస్తాయి. డెల్టా ప్రాంతంలో నాణ్యమైన బెల్లానికి గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం శృంగారపురం కేరాఫ్ అడ్రస్‌గా పేరొందింది. ఈ ఈ ప్రాంతం వారు నగరాలకు వెళ్లినా, విదేశాలకు వెళ్ళినా సంక్రాంతి వస్తుందంటే అమ్మమ్మ, నాయనమ్మలు మనుమలు, మనుమ రాండ్లకు తినిపించే పిండివంటల కోసం బెల్లం కావాలంటే శృంగారపురం గ్రామాన్ని వెతుక్కుంటూ రావల్సిందే.

శృంగారపురం బెల్లంతో

అరిసెలు అదుర్స్ !



దుగ్గిరాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వస్తుందంటే గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలోని శృంగారపురం గ్రామంలోని బెల్లం తయారీ కేంద్రాలు కిటకిటలాడుతుంటాయి. ఇక్కడ సహజ వ్యవసాయపద్ధతుల్లో పండించిన చెరకుతో గత 70ఏళ్లగా మూడుతరరాలు బెల్లం తయారు చేసి నాణ్యమైన బెల్లాన్ని అందిస్తున్నారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా, స్థానికంగా పండించిన నాటు చెరకుతోనే, బెల్లం తయారీ ఇక్కడ ప్రత్యేకం. ఎప్పటికప్పుడు అవసరమైన మేరకు చెరకు గడలు నరికి క్రషర్‌లో వేసి తీసిన స్వచ్ఛమైన చెరకురసంతో బెల్లం తయారు చేస్తున్నారు. అచ్చులుగా పోసి వాటిని పేర్చి ఒక్కోబాక్స్ 22కిలోలు చొప్పున, 33.6కిలోల బరువుండే బెల్లం బుట్టలలో పేర్చి క్రషర్ వద్దే విక్రయిస్తున్నారు. అరిసెలు, బూరెలు, జిలేబీ తయారీకి ప్రధానంగా వినియోగించే బెల్లం తయారీకి శృంగారపురం శాశ్వత చిరునామాగా మారింది. ఎంతో పేరొందిన, తెనాలి సత్యనారాయణ టాకీస్ రోడ్డులోనూ, వడ్లపూడి, రేవేంద్రపాడు గ్రామాల్లో దుకాణాల్లో లభించే జిలేబీ శృంగారపురం బెల్లంతోనే తయారు చేస్తారని చెప్పడం విశేషం.

ధర కొంచెం ఎక్కువైనా..

గత కొద్దికాలంగా గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇదివరలో 200 ఎకరాలకు పైగా ఉన్న చెరకు పంట విస్తీర్ణం 20ఎకరాలకు చేరుకోగా 30కిపైగా ఉన్న బెల్లం క్రషర్‌ల సంఖ్య మూడుకు చేరుకుంది. కాలక్రమంలో బెల్లం వాడకం కంటే పంచదార వాడకం పెరగడంతో బెల్లంకు డిమాండ్ తగ్గింది. గిట్టుబాటు కానప్పటికీ పెద్దల అడుగుజాడల్లో నడుస్తున్న కొద్దిమంది చెరకు రైతులు మాత్రం బెల్లం తయారీ కొనసాగిస్తూ వచ్చారు. దీపావళి నుండి సంక్రాంతి వరకూ కేవలం ఏటా రెండు నెలలపాటు మాత్రమే శృంగారపురంలో బెల్లం తయారు చేస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో బెల్లం ధర కిలో రూ.80ల వరకూ ఉండగా, ఎలాంటి కెమికల్స్ కలపని ఇక్కడి బెల్లం, ధర మాత్రం రూ.110 నుంచి రూ.130లకు విక్రయిస్తున్నారు.

కూలీల కొరతతో తగ్గిన తయారీ..

గతంలో బెల్లం తయారీ కూలీలు వందల సంఖ్యలో ఉండగా పరిసరగ్రామాల్లో ప్రస్తుతం బెల్లం వండే కూలీల సంఖ్య గణనీయంగా పడిపోయింది. కూలీల కొరతతో శ్రీకాకుళం, గోదావరి జిల్లాల నుంచి వలస వచ్చిన కూలీలతో బెల్లం తయారీ క్రషర్‌లు నిర్వహిస్తున్నారు. ఇక్కడ తయారు చేసే బెల్లానికి గిరాకీ ఎక్కువగా ఉన్నప్పటికీ గిట్టుబాటు కాక పోవడంతో సంప్రదాయంగా మాత్రమే బెల్లం తయారు చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా లాభాపేక్ష లేకుండా ఆనవాయితీ పోనివ్వకుండా పెందుర్తి రవికాంత్, యలవర్తి అంకారావు తదితర కొద్ది మంది రైతులు మాత్రమే బెల్లం తయారీ క్రషర్‌లను నిర్వహిస్తున్నారు. ఇక్కడ విక్రయించే బెల్లం పాకం సీసాలు టీ, కాఫీల్లోనూ పంచదారకు బదులుగావినియోగించ వచ్చునని చెప్పడం విశేషం.



చెరకుతో వండి సిద్ధం చేసిన బెల్లం బుట్టలు





ఆరబెట్టిన బెల్లం అచ్చులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ముగిసిన జనరల్ బాడీ సమావేశం

బొల్లాపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కేంద్రమైన ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పీ సీతారామయ్య అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ఎంపీపీ బి.రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పీ సీతారామయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు గ్రామాల్లో కలసి పనిచేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ సుధాకర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలపై పీడీ యాక్ట్: డీఎస్పీ

నూజెండ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాగి తీగల కోసం ట్రాన్స్‌ఫారాలను దొంగిలిస్తున్న వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. ఐనవోలు పోలీసు స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు చేసిన నిందితులను అరెస్టు చేసినట్టు ఐనవోలు ఎస్‌ఐ బీవీ కృష్ణారావు సోమవారం తెలిపారు. నరసరావుపేటలో డీఎస్పీ ఎదుట నిందితులను హాజరుపరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ లక్షల రూపాయల విలువ చేసే ట్రాన్స్‌ఫారాలను కొనుగోలు చేసి వ్యవసాయం చేసి పంటలు పండిస్తుంటే ట్రాన్స్‌ఫారాలు పాడుచేసి రాగి తీగల కోసం చేస్తున్న దొంగతనాలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయన్నారు. అదే విధంగా పాత ఇనుము, స్టీల్ దుకాణదారులు కాపర్ వైర్లను కొనుగోలు చేయవద్దని, దొంగతనాలను అరికట్టడంలో బాధ్యతాయుతంగా ఉండాలని సూచించామన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ బీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

దాబా హోటల్‌లో మద్యం సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

వినుకొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల రోడ్డులోని ఓ దాబా హోటల్‌లో అనుమతులు లేకుండా మద్యం సరఫరా చేస్తున్న రావుల సాయికృష్ణను అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. రోడ్డు పక్కన ఉన్న దాబాలకు ఎలాంటి మద్యం సరఫరాలకు అనుమతులు లేవని, మద్యం తాగిన, తాగించిన నేరమేనని, చట్టరీత్యా శిక్షార్హులవుతారని హెచ్చరించారు.

బేడ, బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

● రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు

ఈపూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ జంగాలను ఎస్సీ కులాల జాబితాలో చేర్చాలని, అప్పుడే వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈపూరులో నివశిస్తున్న బేడ, బుడగ జంగాల కులస్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడం వలన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. సోమవారం ఈపూరు తహసీల్దారు ఏ నళినికి వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగం ప్రకారం ఎస్సీ జాబితాలో చేర్చాలని అన్నారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి ఆలేటి పట్టాభిరాములు, కె.పరమేశ్వరరావు, వీరాంజనేయులు, యల్లయ్య, వెంకట్రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు

వినుకొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కె.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఇద్దరు విద్యార్థినులు జట్టుగా ముగ్గుల పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడో బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబరు 9290930917ను సంప్రదించాలన్నారు.

'అమిత్‌షా క్షమాపణ చెప్పాలి'

యడ్లపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తీర్మానం చేయాల్సిందిగా యడ్లపాడు మండలం తిమ్మాపురం పంచాయతీ సర్పంచ్ పి.ప్రభావతికి కాంగ్రెస్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ, నాయకులు గోవిందు శంకర శ్రీనివాస్, షేక్ బాజీ, టి.నాగేశ్వరరావు, సాగి నరసింహారావు, వల్లెపు సుబ్బారావు, టి.రామారావు, కె.రాజా, షేక్ భాషా, షేక్ సుభాని తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాలో 10మందికి ఉద్యోగాలు

వినుకొండ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వివిధ కంపెనీలతో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో నాలుగు కంపెనీలు హాజరుకాగా మొత్తం 31మంది అభ్యర్థులు హాజరుకాగా 10మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు వినుకొండ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించడం శుభపరిణామమన్నారు. రానున్న రోజుల్లో కళాశాలలో ఏర్పాటు చేయనున్న జాబ్‌మేళాలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉద్యోగాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది వీరాంజనేయులు, సురేష్, జానీ బాషా, శ్రీలక్ష్మి, రామయ్య, శివఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మట్టిరోడ్డులా మారిన సిమెంట్ రోడ్డు



కొచ్చెర్ల కుమ్మరి బజారులో సిమెంట్ రోడ్డుపై ఏర్పడిన బురదకుంట

చినుకు పడితే రోడ్డుపై నడవలేని పరిస్థితి

సిమెంట్ రోడ్డు దెబ్బతినడంతో రోడ్డుకు మట్టితోలి చదును చేశారు. వర్షం పడితే ఆరోడ్డున నడవలేని పరిస్థితి. కొన్ని చోట్ల గోతులు పడి ప్రమాదకరంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని పలువురు గ్రామస్థులు వాపోయారు.

ఈపూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ రోడ్లు మట్టిరోడ్లుగా మారిడంతో ప్రజలు నానా అవస్థలు పడుచున్నారు. మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో సీసీ రోడ్లుగా నిర్మాణం చేసిన కొన్ని వీధులలోని రోడ్లు మట్టిరోడ్లుగా మారిపోయాయి. ఆ వీధులలో రోడ్లు గోతులుపడి వర్షం పడితే మురుగుంటలుగా దర్శనమిస్తున్నాయి. దాంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుచున్నారు. రోడ్లను మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామంలో ప్రధాన రోడ్లన్నీ మట్టిరోడ్లుగా మారిపోయారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో అడుగుకో గొయ్యి ఏర్పడి నడవడానికి కూడా అవస్థలు పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుచున్నారు.



మట్టిరోడ్డులా మారిన సిమెంట్ రోడ్డు

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

● చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



ప్రజా దర్బార్‌లో గ్రామస్థుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టేందుకు ప్రజ దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం చేపట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని అధికారులను జీవీ ఆదేశించారు. వరికపూడిసెల ప్రాజెక్టు పనులు అన్ని అనుమతులతో పనులను ప్రారంభించటం జరుగుతుందని, మండలంలో ఆర్ఎస్ఆర్‌పై భూములకు అర్హులైన రైతులందరికీ హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా బొల్లాపల్లి మండలానికి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. మేనిఫెస్టో అమలు గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఒక్క రోడ్డయినా వేశారా?, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులన్నీ ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలతో సహా అన్ని వర్గాలను మోసం చేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కాగా బొల్లాపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సక్రమంగా పని చేయటం లేదని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. అలాగే గ్రామంలో గ్రంథాలయం, మురుగు కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని కోరారు. గుమ్మనంపాడులో పంచాయతీ నిధులు కోటి రూపాయలు దుర్వినియోగం అయ్యాయని, గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు అరికట్ల వాసుదేవరెడ్డి ప్రజా దర్బార్‌లో వినతిపత్రం అందజేశారు. కంద్రిక, గుట్లాపల్లి, గంగుపల్లి, 13 గ్రామాలకు తాగునీటి సమస్య తీర్చాలని సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు ఉలవలపూడి రాము రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మద్దతు ధర కల్పించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ సీతారామయ్య, తహసీల్దార్ ఏ సుధాకర్, ఎంఈవోలు జప్రుల్లాఖాన్, పార్వతి, ఏవో అబ్బూరి అంకారావు, హౌసింగ్ ఏఈ వాగ్యానాయక్, పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, జరపాల గోవిందు నాయక్, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, అర్థలపూడి శ్రీను, బొల్లాపల్లి కోటేశ్వరరావు, కందుల కోటేశ్వరరావు, వెలిశెట్టి రంగయ్య, బి.వెంకటేశ్వరరెడ్డి, షేక్ ఖాశిం, పెసల వెంకట నారాయణ, దాసరి కోటేశ్వరరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, అధికారులు

నరసరావుపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ప్రజల నుంచి 64 వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో నలుమూల ప్రాంతాల నుంచి అర్జీదారులు ఇక్కడికి వస్తుంగారని అన్నారు. అటువంటి వారి సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కులగణనకు అధిక సమయం కేటాయించి మాదిగలకు అన్యాయం జరగకుండా చూడానలి ఎంఆర్‌పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య మాదిగ కోరారు. రైతుల వద్ద రూ.7 కోట్లు విలువైన కందులలు, శనగలు కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన చిలకలూరిపేటకు చెందిన కోల్డ్ స్టోరేజ్ గుమస్తా గోగుల నాగరాజుపై చర్యలు తీసుకోవాల ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి మాలమహానాడు పట్టణ అధ్యక్షుడు కూచిపూడి జాన్‌బాబుపై హత్యాయత్నం చేసిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి వినతి పత్రం అందజేశారు.

పోలీస్ కార్యాలయంలో 84 ఫిర్యాదులు

నర్సరావుపేట లీగల్, జనవరి 6: పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ అంశాలకు సంబంధించి 84 ఫిర్యాదులు అందాయి. పల్నాడు జిల్లా పరిపాలన ఏ సుబ్బారావు, ఎస్పీ జేవీ సంతోష్ కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రొంపిచర్ల మండలం తుర్లపాడు గ్రామానికి చెందిన పున్నయ్య తనకు ముగ్గురు సంతానం ఉన్నారని, భార్య చనిపోయిన అనంతరం తాను తనపేరుపై ఉన్న మూడు ఎకరాల పొలాన్ని చిన్న కుమారుడికి ఇచ్చి అతని వద్ద ఉంటున్నానన్నారు. ఇటీవల తన పెద్ద కుమారుడు, కుమార్తె తన చిన్న కుమారుడు భూమిని సాగు చేసుకోనివ్వకుండా అడ్డుపడుతున్నారని ఫిర్యాదు చేశాడు. నూజెండ్ల మండలం తలార్లపల్లి గ్రామానికి చెందిన మురళీకృష్ణకు సంవత్సరం క్రితం పాలడుగు మురళీకృష్ణ, కొండేటి చంద్రశేఖర్‌లు వచ్చి స్థలం ఇప్పిస్తామని నగదు తీసుకొని స్థలం ఇప్పించకుండా బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. జలాలపాలెం గ్రామానికి చెందిన గొట్టం గోవిందరాజులు నరసరావుపేటలోని రామిరెడ్డిపేటకు చెందిన పోక వెంకటనారాయణ వద్ద పది లక్షల రూపాయలు చీటీవేసి, సెక్యూరిటీగా రెండు ఖాళీ చెక్కులు ఇచ్చాడు. వాటిని పూర్తిచేసి బ్యాంకులో వసూలుకు వేసి నాలుగు లక్షల 65 వేల రూపాయలు విత్ డ్రా చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. శావల్యాపురం మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన ముంద్రు లలితాంబ పోషణ చూస్తానని కాటం వెంకటేశ్వర్లు నాలుగు లక్షల రూపాయలు తీసుకొని పోషణ చూడకుండా ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన విజయమ్మ తన కుమారిడి ఆచూకీ కనుక్కోవాలని ఫిర్యాదు చేశారు. నరసరావుపేట మండలంలోని ఇక్కుర్తికి చెందిన గుండబోయిన కుమారి చింతలపూడి ఆదినారాయణ అసభ్యకరంగా దూషిస్తూ వేధిస్తున్నాడని ఫిర్యాదుచేశారు. పట్టణానికి చెందిన చిలంకూర్ ఆదిలక్ష్మిని గుంటూరుకు చెందిన ఆత్మకూరు రామారావు నగదు తీసుకొని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదు చేశారు.




ప్రకృతి వ్యవసాయ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యేలు

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్, నవరి 6: (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటలను సాగుచేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ పోస్టర్లను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనా, కలెక్టర్ పి.అరుణ్‌బాబు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రకృతి వ్యవసాయం కె.అమలకుమారి, తదితరులు ప్రకృతి వ్యవసాయ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, మహిళల పాత్రపై పోస్టర్లను ఆవిష్కరించారు.

జాతీయ క్రీడలకు ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల విద్యార్థి ఎంపిక



ఎంపికైన జగదీష్‌ను అభినందిస్తున్న అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మువ్వల సుబ్రహ్మణ్య సుధీర్ సోమవారం తెలిపారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ పురుషుల స్విమ్మింగ్ జట్టుకు ఎంపికలు జరిగాయి. ఈ పోటీలలో ఎస్ఎస్ఎన్ విద్యార్థులు ఎస్ జగదీష్ 100 మీటర్ల బటర్ ఫ్లై, ఫ్రీ స్టైల్ ఈవెంట్‌లలో ప్రతిభ కనబరచి రాష్ట్ర జట్టుకు ఎంపిక అయ్యాడన్నారు. చత్తీస్‌గడ్ ఇందిరాగాంధీ ఇంటర్‌నేషనల్ స్టేడియంలో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 4 వరకు జరిగే జాతీయ పోటీలలో రాష్ట్ర జట్టు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. ఎంపికైన ఎస్.జగదీష్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పి.వెంకటఅప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాససాయి, పీడీ వై.మధుసూదనరావు అభినందించారు.



మెప్మా కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

మెప్మా శిక్షణతో ఉపాధి అవకాశాలు: డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తుల్లో పనిచేసే వారికి మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణంలో మెప్మా కార్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ మహిళలు తన కాళ్ళపై నిలబడి ఆర్థిక ప్రగతి సాధించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకుటుందన్నారు. మహిళలు అంతా స్వశక్తితో జీవనోపాధి పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసరావుపేట గోదాముల్లో జేసీ తనిఖీ



గోదాములను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్

నరసరావుపేట రూరల్, జనవరి 6: (ఆంధ్రజ్యోతి) పల్నాడు జిల్లాలోని నరసరావుపేట స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములను జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో రికార్డులన్నీ పరిశీలించారు, స్టాక్ రిజిస్టర్లు, స్టాకు మొత్తం సక్రమంగా ఉందా లేదా అనేది చూశారు. గోదాములలో రికార్డులను సక్రమంగా నమోదుచేయాలని సూచించారు. గోదాములలో అక్రమాలకు పాల్పడినవారిపై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.



ఉప్పరపాలెం ప్రధాన రహదారి సమీప క్వారీల్లో పేలుళ్లతో కమ్ముకున్న దుమ్ము

క్వారీల్లో పేలుళ్ళతో ప్రయాణికుల బెంబేలు

వినుకొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకింద ఉప్పరపాలెం వెళ్ళే ప్రధాన రహదారిపై కొందరు క్రషర్ల యజమానులు అక్రమంగా క్వారీలలో జిల్‌టెన్‌స్టిక్స్‌తో పేలుస్తుండటంపై స్థానికులు సోమవారం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందస్తు హెచ్చరికలు జారీచేయకుండా ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న క్వారీల్లో పేలుళ్ళు సంభవించడంపై వాహనదారులు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. దీంతో రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, క్వారీల్లో అక్రమ పేలుళ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ఉప్పరపాలెంవాసులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాలలో రూ.10 లక్షల వ్యయంతో పురుషోత్తమపట్నం, పండరీపురం ప్రాంతాలలోని 29, 35, 36 వార్డులలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ, మరమ్మతు పనులను సోమవారం స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించారు. కాంట్రాక్టర్లు, మున్సిపల్ అధికారులతో మాట్లాడి పనుల పురోగతి గురించి ఆయన తెలుసుకున్నారు. కొన్నిచోట్ల ఆయన నిర్మాణ, మరమ్మతు పనులు ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా సంక్రాంతి నాటికి పనులన్నీ పూర్తికావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈ రహీం, జనసేన నాయకులు తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమల రవి పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలలో ప్రత్తిపాటి ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురుషోత్తంపట్నంలోని మున్సిపల్ పాఠశాలను సోమవారం శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉండడంపై ఉపాధ్యాయులను ఆయన ప్రశ్నించారు. ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటే కనీసం 100మంది విద్యార్థులు ఉండాలని, కానీ ఇక్కడ తక్కువగా ఉన్నారని అన్నారు. విద్యార్థుల సంఖ్య పెంపుపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి పాఠశాలలో 100 మందికి పైగా విద్యార్థులు ఉండేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

అక్రమ మైనింగ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

చిలకలూరిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామ పరిధిలో వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఉన్న పాపశిలాగ్ని కొండపై అక్రమ మైనింగ్ జరుగుతున్నదని సోమవారం నరసరావుపేట కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బొప్పూడి, పరిసర ప్రాంతాలకు చెందిన 12మంది ఫిర్యాదు చేశారు. మైనింగ్ లీజుదారులు అనుమతులకు విరుద్ధంగా మైనింగ్ చేస్తున్నట్లు వివరించారు. మైనింగ్ చేసే ప్రాంత పరిధి విషయంలో కూడా చాలా తేడాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం లీజుల బౌండరీ చుట్టూ గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయాలని, కానీ అక్కడ అది జరగటం లేదని పేర్కొన్నారు. ఘాట్ రోడ్‌పై వెళ్లే భక్తులకు ఇబ్బంది లేకుండా జీఐ షీట్లు ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ అవి పాటించడం లేదన్నారు. తనిఖీ అధికారులు లీజుదారులతో కుమక్కయ్యారని ఆరోపించారు. తక్షణం అక్కడ మైనింగ్ కార్యకలాపాలు నిలిపేలా మైనింగ్ శాఖ డైరెక్టర్‌కు సిఫార్స్ చేయాలని వారు అభ్యర్థించారు.

రవీంద్రనాథ్‌కు అభ్యుదయ రైతు పురస్కారం



మంత్రి, ఎంపీ నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న గోనుగుంట్ల రవీంద్రనాథ్

నరసరావుపేట రూరల్ జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రూరల్ మండలం కాకాని గ్రామానికి చెందిన గోనుగుంట్ల రవీంద్రనాథ్ అభ్యుదయ రైతు పురస్కారాన్ని వ్యవసాయశాఖ మంత్రి కే అచ్చంనాయుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నుంచి అందుకున్నారు. సోమవారం రైతు నేస్తం ఫౌండేషన్, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు 2025 కార్యక్రమంలో భాగంగా అభ్యుదయ రైతులకు పురస్కారాలను అందజేశారు. అందులో భాగంగా వ్యవసాయ రంగంలో అభ్యుదయ రైతుగా ఎంపికైన గోనుగుంట్ల రవీంద్రనాథ్ ఈ అరుదైన పురస్కారాన్ని పొందారు. రవీంద్రనాథ్‌ను ప్రజాప్రతినిధులు అభినందించారు.

కృష్ణవేణిలో స్టార్టప్‌లపై అవగాహన సదస్సు

నరసరావుపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజోతి): కృష్ణవేణి డిగ్రీకళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్, ఎంబీఏ విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూర్, స్టార్టప్‌లపై అవగాహన సదస్సు నిర్వహించామని ప్రిన్సిపాల్ నాతాని వెంటేశ్వర్లు సోమవారం తెలిపారు. కార్యక్రమంలో కామర్స్ హెచ్‌వోడీ సర్దార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ సభ్యులకు శిక్షణ

రొంపిచర్ల, జనవరి 6 (ఆంధ్రజోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ నెల 2వ తేదీన ఎస్ఎంసీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. అనంతరం ఈ నెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు శిక్షణ పొందిన వారు ఎస్ఎంసీ సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నారు. సమావేశాలను ఎంఈవోలు అవీల, బ్రహ్మేశ్వరరావు పర్యవేక్షించారు.

ఘనంగా సిద్ధయ్య ఆరాధన మహోత్సవం

నరసరావుపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామపురంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సిద్ధయ్య ఆరాధన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు జరిగాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఓబేటి రాజేంద్రప్రసాదు, పి.హనుమంతరావు, పి.వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలి

● తహసీల్దార్ సురేష్

వినుకొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కల్తీ ఆహారం కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను ప్రజలు ఆరోగ్యంగా స్వీకరించాలని తహశీల్దార్ సురేష్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆర్‌వైఎస్ఎస్ సంస్థ ప్రతినిధులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన స్టాల్‌లో ఆయన ఆకుకూరలు, పండ్లను కొనుగోలుచేసి సిబ్బందిని అభినందించారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వస్తువులను చేస్తున్న అమ్మకాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు, యూనిట్ ఇన్‌చార్జి శివలక్ష్మి, హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.